TELTEL/2023/88710

# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

www.telanganamuchatlu.in




వరంగల్ సంపుటి : 2 సంచిక : 32 మంగళవారం 15 - 10 - 2024 పేజీలు : 08 వెల : 5www.telanganamuchatlu.in

# కోవిడ్ వ్యాక్సిన్లపై పిల్‌ను కొట్టేసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ (అక్టోబర్ 14) : కోవిడ్-19 వ్యాక్సిన్లు తీసుకోవడం వల్ల దుష్ప్రభావాలు కలుగుతాయని ఆరోపిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు సోమవారంనాడు కొట్టివేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్, న్యాయమూర్తులు జేబీ పరిడివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారణకు నిరాకరిస్తూ, ఇది సంచలనం సృష్టించే ప్రయత్నమని పేర్కొంది. వ్యాక్సిన్ తీసుకోకపోవడం వల్ల కలిగే దుష్పలితాలను కూడా అర్థం చేసుకోవాలని స్పష్టం చేసింది. కోవిడ్-19 వ్యాక్సిన్‌ల వల్ల రక్తం గడ్డ కట్టడం వంటి దుష్ప్రభావాలపై యూకేలో కూడా దావా వేశారని పిటిషనర్ల తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, ఈ సమస్యను లేవనెత్తడం తమకు ఇష్టం లేదని, ఇది సంచలన సృష్టించే ప్రయత్నమేనని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. ఈ పిటిషన్ వల్ల ప్రయోజనం ఏమిటని నిలదీసింది. "మీరు వాక్సిన్ తీసుకున్నారా" అని పిటిషనర్ తరపు న్యాయవాదిని ధర్మాసనం ప్రశ్నించింది. అందుకు ఆయన తీసుకున్నట్టు చెప్పారు. వ్యాక్సిన్ తీసుకున్నాక సైడ్ ఎఫెక్ట్ ఏవైనా వచ్చాయా అని తిరిగి ధర్మాసనం అడగ్గా, అలాంటిదేమీ లేదని ఆయన కోర్టుకు సమాధానమిచ్చారు. ప్రియామిశ్రా, మరొకరు సుప్రీంకోర్టులో ఈ 'పిల్' దాఖలు చేశారు.

## కొండా సురేఖ వ్యాఖ్యలపై
# కెటిఆర్ పరువు నష్టం

- పరువుకు భంగం కలిగించినందుకు కఠిన చర్యలు తీసుకోవాలి
- 18వ తేదీకి వాయిదా వేసిన నాంపల్లి కోర్టు



హైదరాబాద్, (అక్టోబర్ 14) : రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మీద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాపై నాంపల్లి స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో సోమవారం విచారణ జరిగింది. తదుపరి విచారణను కోర్టు ఈ నెల 18వ తేదీకి వాయిదా వేసింది. ఈ నెల 18న కేటీఆర్‌తో పాటు నలుగురు సాక్షులు బాల్క సుమన్, సత్యవతి రాథోడ్, తుల ఉమ, దాసోజు శ్రవణ్ స్టేట్‌మెంట్లను కోర్టు రికార్డు చేయనుంది. తన పేరు ప్రతిష్టలకు భంగం కలిగించేలా మంత్రి కొండా సురేఖ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో కేటీఆర్ పిటిషన్

2లో

## మోండాలో ముత్యాలమ్మ
# విగ్రహం ధ్వంసం

- స్థానికుల ధర్నాతో కుమ్మరిగూడలో ఉద్రిక్తత
- ఆలయాన్ని సిపితో కలసి సందర్శించిన కిషన్ రెడ్డి



హైదరాబాద్, (అక్టోబర్ 14) : సికింద్రాబాద్‌లోని మోండా మార్కెట్ సమీపంలోని కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహం ధ్వంసమైంది. దీంతో స్థానికంగా ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఆలయంలో అమ్మవారి విగ్రహం ధ్వంసమైందని ఉదాయన్నే తెలుసుకున్న స్థానికులు పెద్ద ఎత్తున చేరుకొని ఆందోళన చేపట్టారు. దోషులను వెంటనే పట్టుకొని శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు తరచూ జరుగుతున్నాయని ప్రభుత్వం కఠినంగా ఉండాలని చెబుతున్నారు. సికింద్రాబాద్ మోండా మార్కెట్ సమీపంలోని

2లో

# యూపీలో చెలరేగిన హింస

## ఆసుపత్రి, దుకాణాలు దగ్ధం



లక్నో, (అక్టోబర్ 14) : ఉత్తరప్రదేశ్‌లోని బహ్రాయిచ్‌లో దుర్గా విగ్రహ నిమజ్జన ఉరేగింపులో ఆదివారం రాత్రి ఇరువర్గాల మధ్య చెలరేగిన ఘర్షణలో ఒక యువకుడు మృతి చెందడంతో సోమవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మృతుని బంధువులతో పాటు వేలాది వందలాది నిరసనకారులు మృతదేహాన్ని తీసుకుని మహిసి తహసిల్ కార్యాలయానికి చేరుకున్నారు. పెద్దఎత్తున ఆందోళనకు దిగారు. పలువురు ఆందోళన కారులు ఒక ప్రైవేటు ఆసుపత్రి, ద్విచక్రవాహనాల దుకాణంతో సహా పలు ఆస్తులకు నిప్పుపెట్టారు. దీంతో పోలీసు బలగాలు హుటాహుటిన రంగంలోకి దిగి పరిస్థితిని అదుపు లోకి తెచ్చాయి. ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఆదేశాల మేరకు హెూం ఏసీఎస్, శాంతి భద్రతల ఏడీజీ ఘటనా స్థలికి చేరుకున్నట్టు బహ్రా యిచ్ ఎస్పీ వ్రిందా శుక్లా తెలిపారు. పూర్తి బలగాలను రంగంలోకి దింపి పరిస్థితిని అదుపులోనికి తెచ్చామన్నారు. కాగా, మృతుని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సురేశ్వర్ సింగ్ నచ్చచెప్పి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో మృతదేహాన్ని ఖననం చేసేందుకు వారు

2లో

## దేశవ్యాప్తంగా వైద్యుల
# నిరాహార దీక్ష




న్యూఢిల్లీ, (అక్టోబర్ 14) : కోల్‌కతాలో అత్యాచారానికి, హత్యకు గురయిన ట్రైనీ డాక్టరుకు న్యాయం చేయాలని డిమాండు చేస్తూ మంగళవారం దేశ వ్యాప్తంగా వైద్యులు నిరాహార దీక్ష చేయనున్నారు. ఈ విషయాన్ని ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ప్రకటించింది. ఇదే విషయమై కోల్‌కతాలోని ఆర్.జి.కర్ వైద్యకళాశాల వద్ద జూనియర్ డాక్టర్లు చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష తొమ్మిదో రోజుకు

2లో

# సీనియర్ జర్నలిస్టులపై దాడి దుర్మార్గం

- సిఎం సెక్యూరిటీ తీరుపై మండిపడ్డ హరీష్

హైదరాబాద్, (అక్టోబర్ 14) : నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిన్న నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి సెక్యూరిటీ అత్యుత్సాహం ప్రదర్శించి రచయిత, ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరిపై రేవంత్ రెడ్డి సెక్యూరిటీ సిబ్బంది దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా స్పందించారు. అలయ్ బలయ్ కార్యక్రమంలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ప్రొఫెసర్ మాడభూషి శ్రీధర్, సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరిపై రేవంత్ రెడ్డి సెక్యూరిటీ సిబ్బంది దాడి చేయడం ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. పోలీసుల అనుచిత ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నాను అని హరీశ్‌రావు పేర్కొన్నారు. గవర్నర్ బండారు దత్తాత్రేయ స్వయంగా



ఫోన్ చేస్తే వెళ్లాం.. రేవంత్ రెడ్డి వస్తున్నాడని అతని సెక్యూరిటీ నా గొంతు నొక్కి తోసేశారు, నా మిత్రుడు యాదగిరి కాలి పైన తొక్కితే నెత్తురు వచ్చిందని మాడభూషి శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు. సెక్యూరిటీ అంటే చంపడమా?

2లో

# మోదీని కలిసిన అతిషి

## సీఎంగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి



న్యూఢిల్లీ (అక్టోబర్ 14) : ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆప్ సీనియర్ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి సోమవారంనాడు కలుసుకున్నారు. ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆమె ప్రధానిని కలుసుకున్నారు. సమావేశం ఎజెండా ఏమిటనేది మాత్రం వెంటనే తెలియలేదు. ఢిల్లీ ముఖ్యమంత్రి నివాసం కేటాయింపుపై లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనాకు, ప్రభుత్వానికి మధ్య మాటల యుద్ధం నడుస్తున్న తరుణంలో ప్రధానితో అతిషి సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రధానిని ఢిల్లీ సీఎం కలుసుకున్నట్టు పీఎంఓ ఒక ట్వీట్‌లో ధ్రువీకరించింది. అయితే

2లో

## రాగల ఐదురోజులు
# వర్షాలు

### వాతావరణకేంద్రం హెచ్చరిక

హైదరాబాద్, (అక్టోబర్ 14) : తెలంగాణలో రాగల ఐదురోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు అవకాశం ఉందని పేర్కొంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని.. వాయువ్య దిశగా కదులుతూ మరింత బలంగా మారుతుందని పేర్కొంది. మంగళవారం ఉదయం వరకు మధ్యబంగాళాఖాతం వరకు చేరుతుందని చెప్పింది. ఆ

2లో

# సంపాదకీయం

## అనుభవజ్ఞుడికి అగ్నిపరీక్ష!

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విచిత్ర పరిస్థితి ఎదుర్కొంటున్నారు. గతంలో ఆయనకు పాలనా అనుభవం లేదా... అంటే తన రాజకీయ జీవితంలో 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా, 15 ఏళ్లు ప్రతిపక్ష నాయకుడిగా పనిచేసిన అనుభవం ఆయన సొంతం. ఈ రికార్డును ఎవరూ చెరిపివేయలేరు. ఉమ్మడి రాష్ట్రంలో తొమ్మిదేళ్లు ముఖ్యమంత్రిగా, పదేళ్లు ప్రతిపక్ష నాయకుడిగా పని చేసిన ఖ్యాతి ఆయనకు మాత్రమే దక్కింది. తాజాగా జరిగిన ఎన్నికల్లో ఆయన నేతృత్వంలోని కూటమికి గతంలో ఎన్నడూ లభించనన్ని సీట్లు లభించాయి. ఆడుతూ పాడుతూ ప్రభుత్వాన్ని నడపవలసిన తరుణంలో కూడా మునుపు ఎన్నడూ ఎదురుకాని సవాళ్లు చంద్రబాబుకు ఎందుకు ఎదురవుతున్నాయి? ఇందుకు ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఇందులో మొదటిది జగన్ రెడ్డి కాగా, రెండోది తెలుగుదేశం పార్టీ మద్దతుదారులు! ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన జగన్మోహన్ రెడ్డి అమలు చేసిన మోడల్ కారణంగా చంద్రబాబు సరికొత్త సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తోంది. గత ఐదేళ్లలో జగన్ హయాంలో అష్టకష్టాలు పడిన తెలుగుదేశం అభిమానులు కూటమి ప్రభుత్వ నిర్ణయాలపై అతిగా స్పందిస్తున్నారు. దీంతో చిన్నాచితకా విషయాలలో కూడా చంద్రబాబు ఆచితూచి వ్యవహరించాల్సి వస్తోంది. ఫలితంగా పాలనలో తప్పటడుగులు పడటంతోపాటు వేగం మందగించింది. జగన్ రెడ్డి అనుసరించిన మోడల్ నుంచి ప్రభుత్వ యంత్రాంగాన్ని బయటకు తీసుకురావడానికి తిప్పలు పడాల్సి వస్తోంది. అదే సమయంలో సోషల్ మీడియా వేదికగా తెలుగుదేశం అభిమానులు ప్రతిపక్షాన్ని మించి విమర్శలు చేస్తూ ప్రభుత్వాన్ని కలవరపెడుతున్నారు. తెలుగుదేశం కూటమి అధికారంలోకి రావడానికి ఎవరికి వారు తామే కారణమని, తాము కష్టనష్టాలకు ఓర్చి నిలబడటం వల్లనే చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారని చెప్పుకుంటూ, వైసీపీ హయాంలో తమను ఇబ్బందుల పాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవడానికి ఇప్పుడు ఆయన జంకడం ఏమిటని సోషల్ మీడియాలో ఎడా పెడా పోస్టులు పెడుతున్నారు. ప్రభుత్వంలో ఒక చిన్న బదిలీ జరిగినా ఫలానా వాడిని ఫలానా పోస్టులో ఎలా నియమిస్తారంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడికి పదవులు లభిస్తే చాలా? మా ఆకాంక్షల సంగతేమిటి? అని నిలదీస్తున్నారు. తెలుగు తమ్ముళ్ల ఆవేదనలో హేతుబద్ధత ఉంటే ఉండవచ్చునుగానీ వారి ఆవేశం మాత్రం హద్దులు దాటుతోంది. మరోవైపు, జగన్ రెడ్డి హయాంలో అధికార పార్టీ ఎమ్మెల్యేలు రాష్ట్రం మీద పడి దోచుకోవడం ప్రస్తుతం కూటమి ఎమ్మెల్యేలకు ఆదర్శంగా మారడం కూడా ముఖ్యమంత్రి చంద్రబాబుకు తలనొప్పులు తెస్తున్నది.

ఆదాయం.. అరాచకం...

జగన్ రెడ్డి అనుసరించిన విధానం వెరీ సింపుల్! ఇసుక, మద్యం, గనులు వంటి వాటిని తన సొంత ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. తనకు ప్రతి నెలా ఆదాయం తెస్తున్న రంగాలలో ఎమ్మెల్యేలు కాదు కదా, మరెవరినీ ఆయన వేలు పెట్టనిచ్చే వారు కాదు. దీంతో వాటివైపు చూడ్డానికి కూడా ఎమ్మెల్యేలు సాహసించేవారు కాదు. అలా అని జగన్ హయాంలో ఎమ్మెల్యేలు సంపాదించుకోలేదా? అంటే సంపాదించుకున్నారు. తాను ఎంపిక చేసుకున్న ఇసుక, మద్యం, గనులు వంటివి మినహాయించి మిగతా వ్యవహారాల్లో ఎమ్మెల్యేలు ఎంత దోచుకున్నా, ఎంత విచ్చలవిడిగా వ్యవహరించినా జగన్ రెడ్డి పట్టించుకోలేదు. 'నేను హ్యాపీగా ఉంటాను. మీరూ హ్యాపీగా ఉండండి. ప్రభుత్వ సంపద అంటే మన సంపదే' అన్న ఫార్ములాను ఆయన అమలు చేశారు. మరోవైపు ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేసేందుకు గ్రామ స్థాయి కార్యకర్త నుంచి పార్టీ అధినేత చంద్రబాబు వరకు అందరినీ టార్గెట్ చేసుకొని పోలీసులను ప్రయోగించి వేధించారు. ప్రజలలో అశాంతి తలెత్తకుండా ఉండేందుకు సంక్షేమం పేరిట బటన్లు నొక్కే కార్యక్రమాన్ని ఆరంభించారు. తన ఆలోచనలను, వ్యూహాలను అమలు చేసేందుకు ఎంపిక చేసుకున్న అధికారులను కీలక స్థానాల్లో నియమించుకున్నారు. దీంతో జగన్ మాటే శాసనంగా పాలన సాగింది. కంటి చూపుతో చేయాల్సినవి చేశారు, చేయించుకున్నారు. జగన్ రెడ్డికి వ్యక్తిగత ఆదాయం తెచ్చి పెట్టడానికి ఉపయోగపడిన గనుల శాఖ డైరెక్టర్‌గా వెంకటరెడ్డిని, ఎక్సైజ్ శాఖలో వాసుదేవ రెడ్డిని నియమించుకున్నారు. ప్రత్యర్థులను వేధించడంకోసం పీఎస్ఆర్ ఆంజనేయులు, సునీల్ కుమార్, సంజయ్ వంటి ఐపీఎస్ అధికారులను నియమించుకున్నారు. బటన్ నొక్కుడు కార్యక్రమం సాఫీగా జరగడంకోసం డిప్యూటేషన్‌పై రాష్ట్రానికి వచ్చిన సత్యనారాయణకు సర్వాధికారాలు కట్టబెట్టారు. జగన్ రెడ్డి పాలనలో అధికారులు 'ఎస్ బాస్'లుగా ఎలా వ్యవహరించారు? రూల్ ఆఫ్ లా గురించి ఎందుకు పట్టించుకోలేదు? అని ఒక సీనియర్ ఐఏఎస్ అధికారిని ప్రశ్నించగా, 'మా పాత్ర ఏముంది? జగన్ ప్రభుత్వంలో ఏడెనిమిది మంది అధికారులే కీలకంగా ఉండేవారు. మిగతా వాళ్లకు ఏమీ పని ఉండేది కాదు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని సైతం ఉత్సవ విగ్రహంగా మార్చివేశారు' అని ఆయన బదులిచ్చారు. నిజమే! ఎంపిక చేసుకున్న శాఖలు మినహా మిగతా శాఖల గురించి జగన్ రెడ్డి ఒక్క రోజు కూడా పట్టించుకోలేదు. సమీక్షలు నిర్వహించలేదు. ఓట్లు, నోట్లు తెచ్చిపెట్టే శాఖలపైనే ఆయన దృష్టి ఉండేది.

## కొండా సురేఖ వ్యాఖ్యలపై కెటిఆర్ పరువు నష్టం

దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయ లబ్ది కోసం నిరాధారమైన ఆరోపణలు చేశారని అందులో పేర్కొన్నారు. బీఎన్ఎస్ సెక్షన్ 356 కింద క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోర్టును కోరారు. కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై పరువు నష్టం దావా వేస్తానని కేటీఆర్ గతంలోనే లీగల్ నోటీసులు ఇచ్చారు. వారం రోజుల్లోగా బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసుల్లో పేరొన్నారు. ఇచ్చిన గడువు ముగిసిన నేపథ్యంలో మంత్రిపై పరువు నష్టం దావా వేసినట్టు తెలిపారు. తాను ఐదోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యానని, తొమ్మిదేండ్లకుపైగా రాష్ట్ర మంత్రిగా పనిచేశానని పిటిషన్‌లో కేటీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం సిరిసిల్ల నియోజక వర్గ ఎమ్మెల్యేగా, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొనసాగుతున్నానని తెలిపారు. రాష్ట్రానికి ప్రపంచ దేశాలనుంచి పెట్టుబడులు సాధించేందుకు రాష్ట్రం తరఫున విదేశాల్లో జరిగిన అనేక సమావేశాలకు హాజరయ్యానని తెలిపారు. రాష్ట్ర పురోగతికి అంకితభావంతో పనిచేసి పలు సంక్షేమ పథకాల అమలుకు కృషి చేసినట్టు చెప్పారు. ఈ క్రమంలో పలు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు సైతం అందుకున్నట్టు పిటిషన్‌లో పేర్కొన్నారు. అలాంటి తనపై మంత్రి సురేఖ నిరాధార ఆరోపణలు చేశారని, ఆమె వ్యాఖ్యలు తన పరువుకు భంగం కలిగించేవిగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆమె చేసిన వ్యాఖ్యలకు సంబంధించి మీడియాలో వచ్చిన వార్తలను, సోషల్ మీడియాలోని కథనాలను, పలు టీవీ ఛానల్లో వచ్చిన వార్తలను పెన్‌డ్రైవ్‌లో నిక్షిప్తంచేసి కోర్టుకు సమర్పించారు. పత్రికల్లో వచ్చిన క్లిపింగ్‌లను, ఫోటోలను పిటిషన్‌కు జోడించి దాఖలు చేశారు. కొండా సురేఖ గతంలో కూడా ఇలాంటి అడ్డగోలు వ్యాఖ్యలు చేసి, ఎన్నికల సంఘంతో చీవాట్లు తిన్న విషయాన్ని కూడా పిటిషన్‌లో ప్రస్తావించారు. తాజాగా ఆమె చేసిన వ్యాఖ్యలను రాజకీయపరమైన వ్యాఖ్యలుగా మాత్రమే కాకుండా ప్రణాళికబద్ధంగా చేసిన కుట్రగా చూడాలని కేటీఆర్ తన పిటిషన్‌లోవిజ్ఞప్తి చేశారు. సురేఖ చేసిన వ్యాఖ్యలను పరిగణలోకి తీసుకొని, వాటి వెనుక ఉన్న నేరపూరిత దురుద్దేశాల పరిగణలోకి తీసుకొని, ఆమెకు చట్ట ప్రకారం శిక్ష వేయాలని కోర్టును కోరారు. కాగా అక్కినేని నాగచైతన్య, సమంత విడిపోవడానికి మాజీ మంత్రి కేటీఆర్ కారణమంటూ మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఎంతటి సంచలనాన్ని సృష్టించాయో అందరికీ తెలిసిందే. అంతేకాకుండా కేటీఆర్‌ను ఉద్దేశించి మంత్రి అనేక కామెంట్స్ కూడా చేశారు. ఈ క్రమంలో కొండా సురేఖ వ్యాఖ్యలపై కేటీఆర్ కోర్టును ఆశ్రయించారు.

## మోండాలో ముత్యాలమ్మ విగ్రహం ధ్వంసం

కుమ్మరిగూడలో ముత్యాలమ్మ ఆలయం అమ్మవారి విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విషయం తెలియడంతో ఆలయం వద్దకు పెద్ద సంఖ్యలో స్థానికులు చేరుకుని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో పోలీసులు భారీగా మోహరించారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ఆలయం వద్దకు చేరుకున్నారు. సీపీ సీవీ ఆనంద్‌తో కలిసి గుడి లోపలికి వెళ్లి పరిశీలించారు. పోలీసు ఉన్నతాధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మరోవైపు కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణెశ్ ఘటనాస్థలికి చేరుకుని స్థానికులతో మాట్లాడారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు ఇప్పటికే ఒకర్ని అరెస్టు చేశారు. సికింద్రాబాద్‌లో ఈ మధ్య కాలంలో ఆలయాల్లో విగ్రహాలు తరచూ దుండగులు ధ్వంసం చేస్తున్నారు. ఇలాంటి కేసులు ఈ మధ్య కాలంలోన రెండు నమోదు అయ్యాయి. రెండు రోజుల క్రితం ఓ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు విరగొట్టారు. ఆదివారం రాత్రి మరో విగ్రహాన్ని దుండగులు ధ్వంసం చేశారు. ఈ విగ్రహం ధ్వంసం కేసులో ఓ వ్యక్తిని స్థానికులు పట్టుకున్నారు. ఆ ప్రాంతంలో అనుమాస్పదంగా తిరుగుతున్న వ్యక్తికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించారు. మరికొందరు పరారైనట్టు స్థానికులు చెబుతున్నారు స్థానికులు చెప్పిన ఆనవాళ్ల ప్రకారం పరారైన వ్యక్తుల కోసం గాలిస్తున్నారు. స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల ఫుటేజ్‌ను కూడా పరిశీలిస్తున్నారు. విగ్రహం ధ్వంసమైన ఘటనపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సీరియస్ అయ్యారు. గుడిలోపలికి వెళ్లి వివరాలపై ఆరా తీశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అన్ని దేవాలయాల్లో సీసీ కెమెరాలు పెట్టాలని అన్నారు.

## జర్నలిస్టు సుభాష్ మృతి తీరని లోటు

### - టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా శాఖ సంతాపం



**హసన్ పర్తి తెలంగాణ ముచ్చట్లు :** సీనియర్ జర్నలిస్టు, ఆంధ్రజ్యోతి క్రైమ్ రిపోర్టర్ నాయకపు సుభాష్ సోమవారం అకస్మిక గుండె పోటుకు గురై మృతి చెందారు. సుభాష్ అకాల మృతి పట్ల టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్, పి. వేణు మాధవ్, హనుమకొండ జిల్లా అద్యక్ష, కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి, తోట సుధాకర్, వరంగల్ ప్రెస్ క్లబ్ అద్యక్ష, కార్యదర్శులు వేముల నాగరాజు, బొల్లారపు సదయ్య తీవ్ర సంతాపం తెలిపారు. గడిచిన రెండు దశాబ్దాలుగా జర్నలిస్టుగా సుభాష్ అంకిత భావంతో పని చేశారని కొనియాడారు. జర్నలిస్టు యూనియన్ నాయకునిగా కొనసాగుతూనే పాత్రికేయునిగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఆయన మృతి సమాజానికి, జర్నలిస్టు లోకానికి తీరని లోటు అని పేర్కొన్నారు.

## జర్నలిస్ట్ దినేష్ ను పరామర్శించిన దళిత జర్నలిస్టులు




**వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు:** వనపర్తి పట్టణానికి చెందిన ఆంధ్రజ్యోతి జర్నలిస్టు గంధం దినేష్ ను సోమవారం దళిత జర్నలిస్టులు పరామర్శించారు. గత నెలలో రోడ్డు ప్రమాదానికి గురై కాలుకు శస్త్ర చికిత్స చేయించుకుని నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్న దినేష్ ను కలిసి ఆరోగ్య క్షేమాలు తెలుసుకొని జర్నలిస్ట్ దినేష్ త్వరగా కోలుకోవాలని కోరుకున్నారు. దళిత యూనియన్ వర్కింగ్ జర్నలిస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు డి.రవి ప్రసాద్, నవ తెలంగాణ జర్నలిస్ట్ మన్మోహన్, న్యూస్ 24 జర్నలిస్ట్ బాలరాజు, మెట్రో ఉదయం జర్నలిస్టు పర్వతాలు, %ఎ%5 న్యూస్ జర్నలిస్ట్ బండి రాజు, ప్రజా పాలన జర్నలిస్టు గంధం మల్లికార్జున్ జర్నలిస్టు దినేష్ గృహానికి వెళ్లి పరామర్శించడం జరిగింది.

## యూపీలో చెలరేగిన హింస.. ఆసుపత్రి, దుకాణాలు దగ్ధం

అంగీకరించారు. హింసాకాండకు పాల్పడినట్టు చెబుతున్న 30 మందిని పోలీసులు అదుపులోనికి తీసుకున్నారు.

శాంతికి భంగం కలిగిస్తే ఊరుకోం: డిప్యూటీ సీఎం

కాగా, బహ్రాయిచ్ హింసాకాండను ఉపముఖ్యమంత్రి కేశవ్ ప్రసాద్ మౌర్య ఖండించారు. రాష్ట్రంలో శాంతిసామరస్యాలకు భంగం కలిగించే ఎలాంటి కుట్రలను సహించేది లేదన్నారు. అల్లరిమూకలకు రక్షణ కల్పిస్తూ వస్తున్న కొందరు తిరిగి చురుకుగా పనిచేస్తున్నారని, వారి పట్ల అత్యంత అప్రమత్తంగా, పూర్తి నిఘా వేసి ఉంచామని చెప్పారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తును దెబ్బతీస్తే సహించేది లేదని, చట్టాన్ని అతిక్రమించే వారికి కఠిన శిక్ష పడుతుందని, బాధితులకు పూర్తి న్యాయం జరుగుతుందని చెప్పారు. ప్రజలు అల్లర్లకు దారుంగా ఉండాలని, ప్రశాంతతను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

ఏం జరిగింది?

మన్సూర్ గ్రామంలోని మహరాజ్ గంజ్ బజార్‌లో దుర్గా నిమజ్జనం ఊరేగింపుతో కలిసి వస్తున్న రామ్ గోపాల్ మిశ్రా అనే వ్యక్తి అల్లర్ల మూకలు విసిరిన రాళ్లు, కాల్పుల్లో మరణించాడు. మిశ్రాతో పాటు సుమారు డజను మంది ఈ హింసాకాండలో గాయపడ్డారు. సమాచారం తెలియగానే పలు హిందూ సంస్థలు రోడ్లపైకి వచ్చి ఆందోళనకు దిగాయి. దీంతో హర్డి పోలీస్ స్టేషన్ హెడ్ ఎస్‌కే వర్మ, మహిసి ఔట్ పోస్ట్ ఇన్‌చార్జి శివకుమార్‌ను ఎస్పీ సస్పెండ్ చేశారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం చేసి ఆయన గ్రామానికి సోమవారం ఉదయం చేర్చడంతో తిరిగి ఉద్రిక్త పరిస్థితి నెలకొంది.

యోగి వార్నింగ్

దుర్గా నిమజ్జనం సందర్భంగా చెలరేగిన హింసను ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఖండించారు. బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అల్లర్లను రెచ్చగొట్టే వాళ్లను ఎంతమాత్రం సహించేది లేదని అన్నారు. దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలంటూ పోలీసులు అధికారులను ఆదేశించారు. విగ్రహ నిమజ్జనాలు కొనసాగాల్సిందేనని, సకాలంలో విగ్రహాలు నిమజ్జనం చేయాల్సిందిగా రెలిజియస్ ఆర్గనేజేషన్లకు సమాచారం ఇవ్వాలని దిశానిర్దేశం చేశారు.

## రాగల ఐదురోజులు వర్షాలు

తర్వాత రెండురోజుల్లో మరింత ముందుకు కదులుతూ పశ్చిమ వాయువ దశగా కదులుతూ తమిళనాడు, పుదుచ్చేరి, దక్షిణ ఏపీ తీరాలకు చేరే అవకాశం ఉందని వెల్లడించింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలుపడుతాయని చెప్పింది. మంగళవారం నిర్మల్, నిజామాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, జనగాం, భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వానలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది.

## సీనియర్ జర్నలిస్టులపై దాడి దుర్మార్గం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వస్తూ ఉంటే చుట్టూ ఉన్నవాళ్లు పోలీసులా? లేక ప్రైవేట్ సైన్యమా? సీఎం కోసం అక్కడ ఉన్న ప్రతి వాడిని చంపేయాలా? అని ప్రశ్నించారు. అదృష్టవశాత్తు చావు నుంచి తప్పించుకుని, బయటపడ్డాం. సీఎం గారూ! వేదిక వద్దకు వచ్చే ముందు జనాన్ని చంపేయకండి. మీ అలయ్ బలాయ్ లేకపోతే మానేయండి.. సామాన్యుల్ని చంపకండి బండారు దత్తాత్రేయ గారూ అంటూ శ్రీధర్ ఆవేదన వ్యక్తం చేశారు.

## మోదీని కలిసిన అతిషి.. సీఎంగా బాధ్యతలు స్వీకరించాక తొలిసారి

ఇంతకు మించిన సమాచారం ఏదీ తెలియజేయలేదు. ప్రధానితో సమావేశమైనట్టు 'ఎక్స్' వేదకగా అతిషి తెలిపారు. ఢిల్లీ అభివృద్ధికి, సంక్షేమానికి కేంద్రం సహకరిస్తుందని ఆశిస్తున్నట్టు పేర్కొన్నారు. ఎక్సైజ్ పాలసీ కుంబకోణంలో ఐదు నెలల జైలు అనంతరం బెయిలుపై విడుదలైన అరవింద్ కేజ్రీవాల్ తన సీఎం పదవికి రాజీనామా చేయడంతో అతిషి ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు.

## బాధ్యతలు స్వీకరించిన తహాశీల్దార్ వెంకటేశ్వర్లు




ప్రకాశం జిల్లా,రాచర్ల తహాశీల్దార్ గా లోకసాని వెంకటేశ్వర్లు సోమవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గతంలో వెంకటేశ్వర్లు అర్ధవీడు డిప్యూటీ తహాశీల్దార్ విధులు నిర్వహించారు. బదిలీపై వెంకటేశ్వర్లు రాచర్ల కు వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన తహాశీల్దార్ వెంకటేశ్వర్లకు కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా పరిచయం చేసుకొని ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# కొలువైన వ్యవసాయ నూతన కమిటీ

- స్టేషన్ ఘనపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా జులకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి ఎన్నిక
- ప్రమాణ స్వీకారం చేసిన స్టేషన్ ఘనాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్, డైరెక్టర్ల
- వ్యవసాయ నూతన కమిటీ సభ్యులు రైతులకు నీతివంతమైన సేవలు అందించాలి
- కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు కలిసి స్టేషన్ ఘనపూర్ ను అభివృద్ధి చేసుకుందాం
- పార్టీలో గ్రూపు రాజకీయాలు వద్దు పార్టీ లైన్ లో పని చేసే వారికి తప్పకుండా గుర్తింపు




**స్టేషన్ ఘనపూర్: తెలంగాణ ముచ్చట్లు :** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ మండలం మార్కెట్ ప్రాంగణంలో ఈరోజు నూతన మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరయ్యారు, పాత గాంధీ సెంటర్ నుండి మార్కెట్ వరకు ర్యాలీని నిర్వహించి మార్కెట్ స్థలంలో ఏర్పాటుచేసిన సభాస్థలిలో కడియం శ్రీహరి సమక్షంలో నూతనంగా ఎన్నికైన మార్కెట్ కమిటీ చైర్మన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, వైస్ చైర్మన్ గా నూకల ఐలయ్య, ఇతర డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. చైర్మన్ లావణ్య శిరీష్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో మొదటి నుండి కష్టపడి పనిచేసిన వారికి ప్రాధాన్యత దక్కుతుందని మా విషయంలో అది రుజువైంది నా మీద నమ్మకంతో చైర్మన్ పదవి ఇచ్చిన కడియం శ్రీహరి కి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నుకోబడ్డ డైరెక్టర్లకు అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారికి ప్రాధాన్యత ఇస్తూనే కష్టపడి పని చేసే వారికి తప్పకుండా ప్రాధాన్యత ఉంటుందని అన్నారు, పైరవీల ద్వారా పదవులు రావని మొదటి నుండి కాంగ్రెస్ పార్టీలో ఉన్న వారికి పార్టీ జెండాను మోసిన వారికి క్రమశిక్షణతో పార్టీ లైన్లో పనిచేస్తున్న వారిని గుర్తించి ఇచ్చామన్నారు ఇందులో కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారికే 80 శాతం మార్కెట్ కమిటీలో పదవులను ఇవ్వడం జరిగిందన్నారు మిగతా 20 శాతం మాత్రమే వారి యొక్క పనితనాన్ని గుర్తించి పదవులను ఇచ్చామన్నారు రాబోయే రోజులలో కూడా ఇందిరమ్మ ఇళ్లలో కానీ స్థానిక ఎలక్షన్లలో కానీ ఇదే పద్ధతి కొనసాగుతుందని తెలియజేశారు. ఈనాడు ప్రమాణస్వీకారం చేసిన డైరెక్టర్లలో నలుగురు బీసీలు ముగ్గురు ఎస్సీలు ఒకరు మైనారిటీ నుండి ఒకరు ఎస్టీ మిగతా వారందరూ జనరల్ కేటగిరి సంబంధించిన వారు బీసీలు ఎస్సీలు ఎస్టీలు మైనార్టీలు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు అంటే వెనకబడిన బలహీన వర్గాలకే ప్రాధాన్యత ఇవ్వడం జరిగిందన్నారు. ఎస్సీలకు సంబంధించి ఒకరికి అవకాశం ఉ ంటుంది కానీ నా నియోజకవర్గం ఎస్సీ నియోజకవర్గం కాబట్టే ఎక్కువగా ఎస్సీలకు అవకాశం కల్పించే విధంగా ముగ్గురికి అవకాశం కల్పించడం జరిగిందన్నారు.

**పార్టీ లైన్లో పనిచేసే వారికి తప్పకుండా గుర్తింపు ఉంటుంది**

చాలామంది కార్యకర్తలు పార్టీ కోసం కష్టపడిన వారున్నారు మీరు గత ఎన్నికల్లో ఎంత కష్టపడ్డారు పూర్తి సమాచారం నా దగ్గర ఉందని పార్టీ కోసం క్రమశిక్షణతో పని చేసే వారిని తప్పకుండా గుర్తించి ప్రతి ఒక్కరికి రాబోయే రోజులలో కచ్చితంగా చక్కెర భవిష్యత్తు మీకు ఉంటుందని అన్నారు. నేను కాంగ్రెస్ పార్టీలోనికి వచ్చిన తర్వాత గత ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ కొరకు పనిచేసిన వారిని గుర్తించు కచ్చితంగా వారికి అవకాశం ఉన్న సమయంలో కచ్చితంగా పదవులు అందజేస్తానని చెప్పాను అదే రకంగా ఈరోజు చేశానన్నారు. నన్ను నమ్మి నాతోపాటు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చిన కార్యకర్తలు అందరూ నాపై కోపంగా ఉన్నారు ఎందుకంటే మేము మిమ్మల్ని గెలిపించుకున్నాం ఈరోజు మాకు ఎలాంటి పదవులు లేకుండా మమ్మల్ని పక్కన పెట్టేస్తున్నారన్న భావనతో వారు ఉన్నారు అయినా వారితో నేను చెప్పాను మనం కాంగ్రెస్ పార్టీలోకి రాకపోయినా ఈ పదవులు కాంగ్రెస్ పార్టీకి వెళ్లవలసినవి కాబట్టి వాళ్లకి ఈ పదవులు వెళ్లడమే సరైనదని చెప్పి అందరితో మాట్లాడిన మాట మీద గౌరవం ఉంచి నా మాటను వినండి అని చెప్పానన్నారు. కొందరికి అవకాశం రాకపోవచ్చు వ్యక్తిగతంగా రాకపోయినప్పటికీ కాంగ్రెస్ పార్టీలో పార్టీకి వచ్చిందనుకొని ఎన్నికైన వ్యక్తి కాంగ్రెస్ పార్టీ వ్యక్తి అని గుర్తించాలన్నారు. పదవులలో గాని కాంట్రాక్టు విషయంలో గాని మొదటి నుండి కాంగ్రెస్ పార్టీ నమ్ముకుని ఉన్నవాళ్ళకు తప్పకుండా అన్ని అందుతాయి భరోసా ఇచ్చారు.

**అందరం కలిసి అభివృద్ధి చేసుకుందాం**

జాతీయ నాయకుల సహకారంతో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే దిశగా పని చేస్తానన్నారు. రాజకీయాలు గ్రూపులో అవసరం లేకుండా పార్టీ కోసం పనిచేయాలన్నారు గ్రామాలలో పనిచేయుని వ్యక్తులకు అవకాశాలు ఉండవన్నారు. పార్టీ కోసం కష్టపడిన వాళ్లకు తప్పకుండా అవకాశం కల్పిస్తాం అన్నారు గ్రూపులు లేకుండా అందరం కలిసి నియోజకవర్గం కోరారు. ఒకటిన్నర సంవత్సరం ఒక్కో మండలానికి ఒక ఏజెండాతో పనిచేయాలని దాని ప్రకారమే మన స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోనికి తీసుకువెళ్లే విధంగా కార్యాచరణా రూపుదిద్దుతున్నానన్నారు. ఇప్పుడిప్పుడే పనులు ప్రారంభమవుతున్నాయి కాంట్రాక్టర్ ని పిలిపించి టెండర్లు ప్రకటించి పనులు ఆరంభం చేస్తామని నియోజకవర్గంలో పనులు చేపడతానని అన్నారు. ఈ ఐదు సంవత్సరాలలో నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన యజెండాను కచ్చితంగా అమలుపరచి తీరుతానన్నారు. అనవసరంగా సోషల్ మీడియాకు వెళ్లి గ్రూపు రాజకీయాలు చేసి పార్టీని బదనం చేయొద్దని దాని ద్వారా పార్టీకి క్షేమము కాదన్నారు.

**ప్రాముఖ్యత లేదంటూ పరేషాన్ కావొద్దు**

నను స్టేజీల మీదికి పిలువలేదంటూ పార్టీలో ఎలాంటి అభ్యంతరాలు వెల్లడి చేయొద్దని ప్రోటోకాల్ ప్రకారం ప్రతి ఒక్కరికి అవకాశం ఉంటుంది అందరిని స్టేజి మీదకి పిలిచే విధంగా కార్యాచరణ చేస్తానన్నారు. గతంలో ఉన్న మార్కెట్ చైర్మన్లు చాలామంది అందరూ ఈ మార్కెట్ యాడ్ అభివృద్ధి కొరకు పాటుపడ్డారన్నారు. ఒకప్పుడు ఈ ప్రాంతంలో సాగునీరు లేక పంటలు పండగ పోయేది. ఇప్పుడు సాగుకు నీరు అందుతుంది చాలా పంటలు పండుతున్నాయి రైస్ మిల్లులు పెరిగాయి ధాన్యం పెరిగింది రైతులందరూ కూడా మార్కెట్ యార్డ్ ను ఉపయోగించుకోవాలని సూచించారు. పథకాలను పదవుల అమ్ముకునే వాన్ని కాదని ఏ ఒక్కరి దగ్గర లంచం తీసుకున్నట్టు నేను ఎరుగనని నమ్మకముతో స్టేషన్ఘన్పూర్ నియోజకవర్గ ప్రజలు కడియం శ్రీహరి అనే నన్ను ఓట్లు వేసి ఎన్నుకున్నారని గుర్తు చేశారు.

**నీతిగా రైతులకు సేవలందించాలి**

ఇప్పుడు ఎన్నుకోబడ్డ వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు అందరికీ అందుబాటులో ఉండాలని కాంట్రాక్ట్ ఇస్తామని ఒత్తిడి తీసుకొచ్చేవారు గతంలో ఉండేవారని ఇప్పుడు అలాంటి కార్యక్రమాలు చేపడితే ఏ ఒక్కరిని కూడా వదిలిపెట్టేది లేదన్నారు ఒక నీతివంతమైన నిజాయితీతో కూడిన సేవలు అందించే విధంగా మీ అందరూ సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జూలుకుంట శిరీష్ రెడ్డి, చిల్పూర్ మండల అధ్యక్షుడు గడ్డమీద సురేష్, జఫర్గడ్ మండల అధ్యక్షుడు, నూతన మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, డైరెక్టర్లు భూక్య సురేష్, మదిరెడ్డి యశ్వంత్, నీలా వెంకటేశ్వర్లు, వాస్కుల కిరణ్, మారపాక వసంత, మహమ్మద్ అయుష బేగం, కాసాని బొందయ్య, ఇల్లందుల బాబు, పెరళ సుధాకర్, మాచర్ల కుమారస్వామి, గోలి శ్రీనివాస్, వెలమజాల రాంరెడ్డి, మండలాల అధ్యక్షులు, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పిటిసిలు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

## -స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ

**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ ప్రజల దరఖాస్తులను స్వీకరించారు. టేకులపల్లి ప్రాంతానికి చెందిన శారద తనకు కుట్టు మిషన్ శిక్షణ ఇన్స్ట్రక్టర్ గా నియమించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారికి రాస్తూ అవకాశం మేరకు పరిశీలించాలని అదనపు కలెక్టర్ సూచించారు. ఖమ్మం నగరానికి చెందిన పి. దేవీ కరుణ తనకు సొంత ఇంటి జాగా లేదని, ఇందిరమ్మ ఇళ్లు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, కలెక్టరేట్ ఐ విభాగానికి రాస్తూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చర్యలు తీసుకోవాలని అన్నారు. సత్తుపల్లి మండలం కాకర్లపల్లి రెవెన్యూ గ్రామ వాసి జొన్నలగడ్డ రాములు తన తల్లి పేరుపై ఉన్న పట్టా మీద సర్వే నెంబర్ 10 గుంటల భూమిలో 2 గుంటలలో అమ్మవారి దేవాలయం నిర్మాణం చేయగా, మిగిలిన భూమి ఆక్రమించి కమ్యూనిటీ హాల్ నిర్మాణం కొరకు ప్రయత్నిస్తున్నందున తగు చర్యలు తీసుకోవాలని కొరుతూ దరఖాస్తు చేసుకోగా కల్లూరు రెవెన్యూ డివిజన్ అధికారి రాస్తూ చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా అధికారులతో పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులు, బయో మెట్రిక్ అటెండెన్స్, వివిధ అంశాలపై అదనపు కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో అధికంగా పెండింగ్ ఉన్న ప్రజావాణి దరఖాస్తులను అదనపు కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించి దరఖాస్తులను త్వరగా పరిష్కరించడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. మండలంలో పెండింగ్ ప్రజావాణి దరఖాస్తులపై మండల ప్రత్యేక అధికారులు శ్రద్ధ వహించాలని అదనపు కలెక్టర్ తెలిపారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పని చేసే ప్రభుత్వ అధికారుల, సిబ్బంది బయోమెట్రిక్ అటెండెన్స్ పై అదనపు కలెక్టర్ సమీక్షించారు. బయో మెట్రిక్ అటెండెన్స్ తక్కువ నమోదు కావడం పట్ల అదనపు కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రభుత్వ సిబ్బంది రెగ్యులర్ గా బయో మెట్రిక్ ద్వారా హాజరు నమోదు చేయాలని అన్నారు. ఫీల్డ్ స్టాఫ్ ప్రభుత్వ కార్యాలయాలకు నివేదికలు సమర్పించే సమయంలో కూడా తప్పనిసరిగా బయోమెట్రిక్ అటెండెన్స్ వేయాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ప్రతి శాఖ అధికారి వారి పరిధిలోని సిబ్బంది అటెండెన్స్ రెగ్యులర్ గా మానిటర్ చేయాలని, పదవీ విరమణ పొందే వారికి కలెక్టరేట్ సమావేశం మందిరంలో సన్మానించడంతో పాటు రిటైర్మెంట్ రోజే బెనిఫిట్స్ అందే విధంగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారని, దీనికి సంబంధించి జిల్లా అధికారులు తమ



కార్యాలయ పరిధిలో రిటైర్ అయ్యే వారి వివరాలు నిర్దేశిత ఫార్మాట్ లో వెంటనే అందజేయాలని అన్నారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సి.ఈ.ఓ. దీక్ష రైనా, డి.ఆర్.డి.ఓ. సన్యాసయ్య, జిల్లా రెవెన్యూ అధికారి రాజేశ్వరి, కలెక్టరేట్ పరిపాలన అధికారి అరుణ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ వివిధ సెక్షన్ ల సూపరింటెండెంట్ లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఓటర్ జాబితా రూపకల్పన

## - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ




**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్, తెలంగాణ ముచ్చట్లు:** ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించే దిశగా ఓటరు జాబితా సవరణ-2025 ప్రక్రియను చేపట్టడం జరిగిందని, ఎలక్టోరల్ రోల్/ఎపిక్ లో వ్యత్యాసాల తొలగింపు, చేర్పులు, మార్పులతో పాటు, జాబితాలో ఓటర్ ల ఫోటోలు స్పష్టంగా ఉండే విధంగా, బోగస్ కార్డుల ఏరివేత, మృతులపేర్లు తొలగించి పకడ్బందీగా తుది జాబితా రూపొందించుటకు సహకరించాలని అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ రాజకీయ పార్టీల ప్రతినిధులతో అన్నారు. సోమవారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఎస్.ఎస్.ఆర్. -2025, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ, ఎలక్టోరల్ రోల్/ఎపిక్ లో వ్యత్యాసాల తొలగింపుపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఈ సందర్భంగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ మాట్లాడుతూ, పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ తర్వాత జిల్లాలో మొత్తం 5 నూతన పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఖమ్మం జిల్లాలో మొత్తం 5 అసెంబ్లీ నియోజక వర్గాలు, ఖమ్మం, పాలేరు, సత్తుపల్లి, మధిర, వైరా ఉన్నాయని తెలిపారు. ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉంటే నూతన పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అన్నారు. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ తర్వాత ఖమ్మం, మధిర, వైరా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎటువంటి మార్పులు లేవని, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో రెండు, సత్తుపల్లి అసెంబ్లీ నియోజక వర్గంలో 3 పోలింగ్ కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేశామని, అట్టి వివరాలను రాజకీయ పార్టీలకు తెలియజేసామని అన్నారు. పకడ్బందీగా ఓటర్ జాబితా రూపకల్పనపై రాజకీయ పార్టీల ప్రతినిధులు దృష్టి సారించాలని, అక్టోబర్ 29న డ్రాఫ్ట్ ఓటర్ జాబితా విడుదల చేయడం జరుగుతుందని, దీనిపై అభ్యంతరాలను, ఓటర్ నమోదు దరఖాస్తులను నవంబర్ 28 వరకు స్వీకరిస్తామని, డిసెంబర్ 24 వరకు అభ్యంతరాలను పరిష్కరించి, 2025 జనవరి 6న తుది ఓటర్ జాబితా ప్రచురించడం జరుగుతుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఓటర్ నమోదు, చేర్పులు, మార్పులపై ప్రజలలో విస్తృతంగా ప్రచారం నిర్వహించేందుకు నవంబర్ 9, 10వ తేదీలలో ప్రత్యేక క్యాంపెయిన్ జరుగుతుందని, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్ స్థాయి అధికారి ఓటర్ జాబితాతో అందుబాటులో ఉంటారని, ప్రతి ఒక్కరు తమ ఓటును చెక్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధి శ్రీనివాస్, భాజాపా పార్టీ ప్రతినిధి వి.రాజేష్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి ఏ. గోపాల్, భారాస పార్టీ ప్రతినిధులు కే. ఫ్రాన్సీస్, సి.పి.ఐ(ఎం) పార్టీ ప్రతినిధి ఆర్. ప్రకాష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, కలెక్టరేట్ ఎలెక్షన్ విభాగ డి.టి. అన్సారి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక బాధ్యతగా నిరుద్యోగులకు శిక్షణ




**తెలంగాణ ముచ్చట్లు, మందమర్రి:** రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచనల మేరకు సింగరేణి యాజమాన్యం స్థానికంగా ఉండే నిరుద్యోగ యువతకు లబ్ధి చేకూర్చు దిశగా, సామాజిక బాధ్యతగా స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తుందని ఏరియా జిఎం జి దేవేందర్ తెలిపారు. సోమవారం పట్టణంలోని స్కిల్ డెవలప్మెంట్ శిక్షణ కేంద్రంలో సింగరేణి ఏరియా సిఎస్ఆర్, రీజనల్ డైరెక్టరేట్ అఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంటర్ప్రినర్షిప్ (ఆర్డిఎస్డిఇ), హైదరాబాద్ ఆద్వర్యంలో కంప్యూటర్, డిటిపి కోర్సును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కంప్యూటర్, డిటిపి కోర్సును ప్రారంభించడం సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. స్థానిక నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటు జిఎం రాజేశ్వర్ రెడ్డి, ఏఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి శైలేంద్ర సత్యనారాయణ, ఈ అండ్ ఎం డిజిఎం వై వెంకటరమణ, జిఎంవిటిసి మేనేజర్ శంకర్, జిఎంవిటిసి అసిస్టెంట్ ట్రైనింగ్ మేనేజర్ అశోక్, కంప్యూటర్ శిక్షకులు బెంజిమెన్ తదితరులు పాల్గొన్నారు.


# ఏటీసీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం



**తెలంగాణ ముచ్చట్లు, మందమర్రి:** ప్రస్తుత పారిశ్రామిక సంస్థలకు నైపుణ్య మానవ వనరులను అందించడమే లక్ష్యంగా, యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపరిచే విధంగా టాటా టెక్నాలజీ సహకారంతో నూతనంగా నిర్మించబడిన అడ్వాన్స్ డ్ టెక్నాలజీ సెంటర్స్ (ఏటీసీ)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని పట్టణ ప్రభుత్వ ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ జి దేవానంద్ సోమవారం ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏటీసీ కేంద్రంలో ఆరు కోర్సులు నిర్వహిస్తుండగా, అందులో మూడు కోర్సులు ఒక సంవత్సరం కాలవ్యవధి, మిగిలిన మూడు కోర్సులు రెండు సంవత్సరాల కాలవ్యవధి కలిగి ఉన్నాయని తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన ఆసక్తిగల అభ్యర్థులు అక్టోబర్ 14 నుండి అక్టోబర్ 19 వరకు రాష్ట్ర ప్రభుత్వ ఐటిఐ వెబ్సైట్ లో అన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అన్ లైన్ లో దరఖాస్తు చేసుకున్న అనంతరం కళాశాల పని వేళలో కళాశాలలో సంప్రదించాలని తెలిపారు. జిల్లాలో 25 ఐటిఐ కళాశాలలు ఉండగా, కేవలం పట్టణ ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో మాత్రమే ఏటీసీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని, ఆసక్తి గల 10వ తరగతి విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 7013846573, 9154549697, 9885981959 నెంబర్ లను సంప్రదించాలన్నారు.

# ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సబావత్ మోతిలాల్, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారి హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. జైపూర్ మండలం శివ్వారం గ్రామానికి చెందిన రాజశ్రీ అంజన్న నిరుపేద అయిన తనకు గృహ నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి ఇల్లు మంజూరు చేయగలరని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణం హనుమాన్ మందిర్ లో పూజారిగా పనిచేస్తున్న మనీష్ కుమార్ మిశ్రా తనకు ఇంటి స్థలం ఉందని తనపై ఆధారపడిన కుటుంబ సభ్యుల పోషణ, పిల్లల సంరక్షణ కొరకు నిరుపేద అయిన తనకు ఇంటి నిర్మాణం కోసం ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన కొలిపాక శ్రీనివాస్ తన దరఖాస్తులో బెల్లంపల్లి పట్టణంలోని స్మశాన వాటిక, బజార్ ఏరియా, పట్టణంలోని కొన్ని ప్రాంతాలలో రహదారులకు అడ్డంగా ఉన్న అక్రమ నిర్మాణాలను తొలగించి ప్రజలకు ఇబ్బందులు లేని రోడ్డు సౌకర్యం కల్పించాలని కోరారు. దండేపల్లి మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన ఎల్తపు శంకరయ్య తనకు గ్రామ శివారులో పట్టాభూమి ఉందని, పట్టాదారు పాస్ పుస్తకంలో భూమి విస్తీర్ణం తక్కువగా నమోదు కావడంతో పాటు ఇతరుల పేరిట తప్పుగా రికార్డు అయి ఉందని, ఈ పొరపాటును సవరించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. జైపూర్ మండలం టేకుమట్ల గ్రామానికి చెందిన గాడిపెల్లి సుధాకర్ తనకు గ్రామ శివారులో పట్టా భూమి ఉందని, తనకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా సింగరేణి సంస్థ వారు ఆధీనంలోకి తీసుకున్నారని, ఈ విషయమై తనకు న్యాయం చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజావాణి కార్యక్రమంలో 18 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కారం దిశగా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు

## - జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో గల కలెక్టర్ సమావేశ మందిరంలో సెంటర్ ఫర్ రూరల్ మేనేజ్మెంట్ నేషనల్ లెవల్ మానిటర్స్ సభ్యులు సివి బాలమురళి, కె హెచ్ సునీల్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్ తో కలిసి జిల్లా గ్రామీణాభివృద్ధి, వయోజన విద్య, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్, పంచాయతీ శాఖ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కొరకు చేపట్టవలసిన కార్యక్రమాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజల సంక్షేమంపై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో చేపట్టి కొనసాగుతున్న అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలని, 250 మంది జనాభా కన్నా అధికంగా గల వివిధ గ్రామాల నుండి మండల కేంద్రానికి అనుసంధానమయ్యే బిటి రోడ్లు, మరమ్మత్తు వివరాలతో నిబంధనలకు లోబడి నివేదిక అందించాలని తెలిపారు. పెన్షన్, భూగర్భ జల, వంతెనలు, సెగ్రిగేషన్ షెడ్లతో పాటు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఇతర ప్రజా ప్రయోజనకర పనులను వేగవంతం చేయాలని తెలిపారు. సెంటర్ ఫర్ రూరల్ మేనేజ్మెంట్ నేషనల్ లెవల్ మానిటర్స్ సభ్యులు ఈ నెల 15 నుండి 19వ తేదీ వరకు జిల్లాలోని 4 మండలాలలో ఎంపిక చేసిన 10 గ్రామపంచాయితీలలో పర్యటిస్తారని, గ్రామాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలిస్తారని తెలిపారు. ఈ నెల 15వ తేదీన జైపూర్ మండలంలో బెజ్జాల, గంగిపల్లి, 16వ తేదీన హాజీపూర్ మండలం వేంపల్లి, పెద్దపేట, 17వ తేదీన జైపూర్ మండలం టేకుమట్ల, హాజీపూర్ మండలం బుద్ధిపల్లి, 18న దండేపల్లి మండలం కన్నెపల్లి, ధర్మారావుపేట, 19న చెన్నూరు మండలం లింగంపల్లి, నారాయణపూర్ గ్రామాలలో పర్యటించడం జరుగుతుందని, ఆయా గ్రామాలలో కొనసాగుతున్న పనుల వివరాలను వేరువేరుగా నివేదికలు రూపొందించి అందించాలని, మానిటర్స్ సభ్యులు ఆయా తేదీలలో గ్రామాలలోని ప్రజలను కలిసి అభివృద్ధి పనుల వివరాలు తెలుసుకుంటారని తెలిపారు. జిల్లా వయోజన విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న న్యూ ఇండియా లిటరసీ కార్యక్రమం సంబంధించిన సర్వే ప్రక్రియను పరిశీలిస్తారని, ఇప్పటి వరకు 11 మండలాలలో సర్వే ప్రక్రియ పూర్తి అయిందని తెలిపారు. మానిటర్స్ సభ్యులు గ్రామాలలో పర్యటించే సమాచారాన్ని ఆయా గ్రామాల ప్రజలకు ముందుగా తెలియజేయాలని, మండల స్థాయి అధికారులు ఖచ్చితంగా అందుబాటులో ఉండాలని, గ్రామాలలో కొనసాగుతున్న పనుల పురోగతి వివరాలను ఫోటోగ్రాఫ్ కలిపి కేంద్రానికి సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రధానమంత్రి క్రిషి సంచాయ్ యోజన, ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన పథకాల క్రింద గ్రామాలలో వ్యవసాయానికి సాగునీరు, త్రాగునీరు, గ్రామాలను మండల కేంద్రాలకు అనుసంధానం చేసే అంతర్గత రహదారుల ఏర్పాటుపై అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలకు మెరుగైన పాలన అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుంది

**నందివాడ, తెలంగాణ ముచ్చట్లు :** ప్రజలకు మెరుగైన పాలన అందించి వారికి మంచి చేసేందుకే సీఎం చంద్రబాబు,డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. నందివాడ మండలంలో జరిగిన పల్లె పండగ కార్యక్రమంలో కూటమినేతలు, అధికారులతో కలిసి రావి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రూ.30.25లక్షల నిధులతో నందివాడలో గ్రామంలో,రూ.40లక్షలతో తుమ్మలపల్లిలో,రూ.45.01 లక్షల నిధులతో లక్ష్మీ నరసింహ పురంగ్రామంలో రూ.25 లక్షల నిధులతో కుదరవల్లి గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణ పనులకు మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టిడిపి నేత వెనిగండ్ల రామకృష్ణ (నాని) భూమి పూజ నిర్వహించి శంకుస్థాపన చేశారు. రాష్ట్రవ్యాప్తంగా పండగ వాతావరణంలో పల్లె పండగ కార్యక్రమం ఎంతో ఘనంగా జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల వ్యవధిలో గ్రామాల్లో నాలుగున్నర వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గడిచిన ఐదేళ్ల వైకాపా పాలనలో..... గ్రామాల్లో ఎంత అభివృద్ధి జరిగింది.పంచాయతీ వ్యవస్థ ఎంత నిర్వీర్యం అయ్యిందో ప్రజలందరికీ తెలుసన్నారు. గుడివాడ నియోజకవర్గ అభివృద్ధికి వెనిగండ్ల రాము అన్ని విధాలుగా కృషి చేస్తున్నారని ఈ సందర్భంగా రావి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు దానేటి సన్యాసిరావు, గుడివాడ బి.జె.పి కన్వీనర్ దావులూరు సురేంద్రబాబు,టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, చాట్రగడ్డ రవి,యలమంచిలి సతీష్,ఎంపీపీ పెయ్యల అదాం, ఎండిఓ మల్లీశ్వరి,తాసిల్దార్ రఘురాం రెడ్డి, పంచాయతీరాజ్ డిఇ రవికుమార్, పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

# ఉచిత స్కిల్ శిక్షణ ను సద్వినియోగం చేసుకోండి

**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వంచే స్థాపించబడిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ (ఎన్ఏసి), ఈజీఎంఎం సంయుక్త ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని యువకులకు ఉచిత స్కిల్ శిక్షణ ఇచ్చి, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని ఈ కార్యక్రమాన్ని ఆసక్తిగల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎన్ఏసి అసిస్టెంట్ డైరెక్టర్ నాగేందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లంబింగ్ శానిటేషన్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సులకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం, హాస్టల్ వసతి కల్పించడం జరుగుతుందని, కోర్సుకు అవసరమయ్యే పుస్తకాలు, యూనిఫామ్, షూస్, హెల్మెట్, ట్రైనింగ్ కోర్స్ మెటీరియల్ ఉచితంగా అందజేయడం జరుగుతుందన్నారు. కోర్సు పూర్తి చేసిన వారికి ఎన్ఏసి సర్టిఫికెట్ తో పాటు ప్రైవేటు కంపెనీలో ఉపాధి అవకాశం చూపించడం జరుగుతుందన్నారు. పదో తరగతి చదివి, 18 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువకులు ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. బెల్లంపల్లి పట్టణంలోని శిక్షణ కేంద్రంలో అక్టోబర్ 16 నుండి మూడు నెలల పాటు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మరిన్ని వివరాలకు 8328507232, 8790414049 నెంబర్లను సంప్రదించాల్సిందిగా సూచించారు.

# రామాలయ ఆవరణలో మద్యం సేవిస్తూ దొరికిన యువత

## మా నాన్న ఎవరో తెలుసా అంటూ కాలనిలో మందుబాబుల వీరంగం

**వేలేరు, తెలంగాణ ముచ్చట్లు :** మండలంలోని మలికుదుర్ల గ్రామంలో గల రామాలయం ఆవరణలో కొందరు యువకులు సభ్యత సంస్కారం లేకుండా ఆలయ ఆవరణలోనే మందు సేవిస్తున్నారు. ఇది పద్ధతి కాదని ప్రశ్నించే వారిపై మందుబాబులు చేయి చేసుకుంటూ గొడవకు దిగుతున్నారు. రోజు రోజుకి మందుబాబుల ఆగడాలకు అడ్డుకట్టు లేకుండా పోతుంది. మద్యం సేవిస్తూ దారిన పోయే వారితో కావల్చుకొని గొడవకు దిగుతున్నారు. ఏమీ చేయలేని పరిస్థితిలో కాలనీవాసులు కృంగిపోతున్నారు, మద్యం మత్తే కాకుండా గంజాయి, డ్రగ్స్ కోరల్లో మల్లికుదుర్ల గ్రామ యువత నిర్బంధమైపోతూందని పలువురు అభిప్రాయపడుతున్నారు. తాజాగా శనివారం సాయంత్రం దర్జాగా మందుబాబులు ఆలయ ఆవరణలో మద్యం సేవిస్తూ కనబడటంతో అప్రమత్తమైన స్థానికులు ఇది సభ్యత కాదని ప్రశ్నించడంతో ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి దిగుతూ గుండాయిజాన్ని ప్రదర్శిస్తున్నారు. విద్యుత్ దీపాలు లేని కారణంగా



చీకటి పడటంతో అసాంఘిక కార్యకలాపాలకు కూడా ఆ గదులను వాడుకుంటున్నారని గుసగుసలు వినిపిస్తున్నాయి, ఇది చూడలేని స్థానికుల గోడు మిన్ను అంటుతున్నది. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి మద్యం, డ్రగ్స్ వంటి వాటి నుండి యువతను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

# మిత్రుని కుటుంబానికి ఆర్థిక సహాయం



**వేలేరు, తెలంగాణ ముచ్చట్లు :** మండల కేంద్రానికి చెందిన పోతరబోయిన రాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. మృతి విషయాన్నీ తెలుసుకున్న 1997 – 98 జెడ్పిహెచెస్ వేలేరు పాఠశాలకు చెందిన బ్యాచ్ మిత్రులు 30 వేల ఆర్థిక సహాయాన్ని సోమవారం వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. మిత్రుని కుటుంబ సభ్యులకు సహాయం చేసిన తోటి పదవ తరగతి బ్యాచ్ చొరవను గ్రామంలో పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మొహమ్మద్ ఫారూఖ్, రాజెంద్రప్రసాద్ , నాగేశ్వర్ రావు , ఈశ్వర్, రాజు, సర్దార్,రెహమాన్, రమేశ్ , తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడి మృతి



**తెలంగాణ ముచ్చట్లు, మంచిర్యాల జిల్లా ప్రతినిధి:** జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సింగరేణి ఏరియాలోని కాసీపేట 2 గనిలో కోల్ కట్టర్ గా విధులు నిర్వహిస్తున్న సింగరేణి కార్మికుడు కంశెట్టి కిరణ్ కుమార్ (45) మృతి చెందాడు. బెల్లంపల్లి 2 టౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం, జిల్లాలోని రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన సింగరేణి కార్మికుడు కిరణ్ కుమార్ బెల్లంపల్లి మండలం చాకెపల్లి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి వెళ్లి, తిరిగి తన స్వగ్రామమైన రామకృష్ణాపూర్ పట్టణానికి తన ద్విచక్ర వాహనంపై తిరిగి వెళు తుండగా, బెల్లంపల్లి పట్టణంలోని కాల్ టెక్స్ ఫ్లైఓవర్ బ్రిడ్జి పై ఉన్న విద్యుత్ స్తంభాన్ని అదుపుతప్పి వేగంగా ఢీకొట్టడంతో తీవ్ర గాయాలు పాలై అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. కాగా సోమవారం మృతుని కుటుంబ సభ్యులను గని సంక్షేమ అధికారి, గుర్తింపు కార్మిక సంఘం ఏఐటియుసి బెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగం మల్లేష్, గని పిట్ కార్యదర్శి గొల్ల శ్రీనివాస్, నాయకులు బోనగిరి రవి, శంకర్, బాపు లు పరామర్శించి, కిరణ్ ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ, అంత్యక్రియల నిమిత్తం కిరణ్ తండ్రికి 5 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కిరణ్ అంతక్రియలు వారి సొంత గ్రామమైన జమ్మికుంటలో నిర్వహించడం జరుగుతుందని కుటుంబ సభ్యులు తెలిపారు.

# ప్రశాంతంగా ముగిసిన మద్యం లక్కీడిప్ ప్రక్రియ



**నెల్లూరు, తెలంగాణ ముచ్చట్లు :** జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసినట్లు కలెక్టర్ ఒ.ఆనంద్ వెల్లడించారు. సోమవారం ఉదయం నెల్లూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర కస్తూర్భ కళాక్షేత్రంలో మద్యం దుకాణాల కేటాయింపునకు లక్కీడిప్ ప్రక్రియను ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఉదయం 8 గంటల ప్రారంభమైన లక్కీడిప్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఆనంద్, జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. భారీగా చేరుకున్న టెండరు దరఖాస్తు దారులతో కళాక్షేత్రం కిటకిటలాడింది. ప్రశాంతంగా నిర్వహించిన దుకాణాల లక్కీడిప్ ప్రక్రియ మధ్యాహ్నం ఒంటిగంట వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంతంగా, పారదర్శంగా మద్యం దుకాణాల కేటాయింపు లక్కీడిప్ ప్రక్రియ పూర్తయినట్లు చెప్పారు. రెండు టేబుళ్లను ఏర్పాటుచేసి ఒక్కొక్క టేబుల్ వద్ద ఇద్దరు వీడియో గ్రాఫర్లతో పూర్తి ప్రక్రియను వీడియోగ్రఫి చిత్రీకరించినట్లు చెప్పారు. ఒక టేబుల్ వద్ద తాను, మరొక టేబుల్ వద్ద జాయింట్ కలెక్టర్ పూర్తిగా ప్రక్రియను పర్యవేక్షించినట్లు చెప్పారు. ఆయా షాపులకు టెండర్లు దాఖలు చేసిన దరఖాస్తుదారుల సమక్షంలోనే లక్కీడిప్ తీసి షాపు దక్కించుకున్న వారి పేరును ప్రకటించినట్లు కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 182 మద్యం దుకాణాలకు 3872మంది టెండర్లు దాఖలు చేయగా, 182 మద్యం షాపులకు లక్కీడిప్ ద్వారా 182 మందిని ఎంపిక చేసినట్లు కలెక్టర్ చెప్పారు. ఈ లక్కీడిప్ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసులునాయుడు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రమేష్, డిపో సూపరింటెండెంట్ ఆయోషా బేగం, ఎక్సైజ్ పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రవి హాస్పిటల్ ప్రారంభోత్సవం

గుంటూరు అక్టోబర్ 13: గుంటూరు ఏటి అగ్రహారం లో నూతనంగా రవి హాస్పిటల్ డాక్టర్ చదలవాడ రవీంద్రనాథ్, డాక్టర్ చదలవాడ నాగార్జున లు చే స్థాపించబడిన రవి హాస్పిటల్ ను సత్తెనపల్లి శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ, నరసరావుపేట శాసనసభ్యులు చదలవాడ అరవింద్ బాబు, ఎమ్మెల్సీ లేళ్ల. అప్పిరెడ్డి లచే ప్రారంభోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, చదలవాడ అరవింద్ బాబు మాట్లాడుతూ ఏటి అగ్రహారంలో 35 సంవత్సరాలకుపైగా పేద, మధ్యతరగతి వర్గాలకు వైద్య సేవలు అందిస్తున్న రవి ఆస్పటల్ నూతన భవనంలో అధునాతన సౌకర్యాలతో ప్రజలకు చేరువ కావటం అభినందనీయ మైన విషయమని, రానున్న రోజులలో కూడా వీరి సేవలు ఇలాగే కొనసాగించాలని కొనియాడారు. ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు చదలవాడ జగన్నాథం మాస్టర్ శిష్య రికంలో పెరిగిన తనకు వీరి కుమారుడైన డాక్టర్ చదలవాడ రవీంద్రనాథ్, మనవడు డాక్టర్ చదలవాడ నాగార్జునలు రవి హాస్పిటల్ ని స్థాపించి మెరుగైన వైద్య సేవలు ఏటి అగ్రహారం పరిసర ప్రాంతాల్లో అందించటం ఎంతో అభినందనీయమని అన్నారు. రవి హాస్పిటల్ అధినేతలు డాక్టర్ చదలవాడ రవీంద్రనాథ్, డాక్టర్ నాగర్జున లు మాట్లాడుతూ ఏటి



అగ్రహారం మెయిన్ రోడ్డు 3వ లైన్ లో గల మా రవి హాస్పిటల్ నందు సాధారణ వైద్య సేవలతో పాటు అధునాతనమైన ఆపరేషన్ థియేటర్ లు, ఐసీయూ, ఏసి, సాధారణ వార్డులు, క్లినికల్ లేబరేటరీ, ఫార్మసీ, ఎమర్జెన్సీ సర్వీస్ కోసం అంబులెన్స్ లను అందుబాటులో ఉంచామని అన్నారు. ఈ కార్యక్రమంలో హాస్పటల్ డాక్టర్స్ డి శరణ్య, డాక్టర్ కే వెంకట్రామ్, డాక్టర్ డి. మీనాక్షి ప్రణవి, చదలవాడ వేణు, గుంటూరు నగరంలోని ప్రముఖ డాక్టర్లు, కార్పొరేటర్లు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

# "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపించాలి

**అనంతపురం, తెలంగాణ ముచ్చట్లు :** అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవెన్స్ రీడ్రసెల్ సిస్టం, పిజిఆర్ఎస్) కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ అర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించే కార్యక్రమంలో డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, డిపిఎం ఆనంద్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 253 అర్జీలను జిల్లా కలెక్టర్ స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం చూపించాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి పెండింగ్ ఉంచకుండా సకాలంలో అర్జీలకు పరిష్కారం చూపించాలన్నారు. అర్జీల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి కార్యాలయంలోనూ జనరేటర్ బ్యాకప్ ఏర్పాటు చేయాలని, అన్ని తహసిల్దార్, ఎంపీడీవో, ఆర్డీఓ కార్యాలయాల్లో, కలెక్టరేట్లో బ్యాకప్ జనరేటర్ ఉండాలని, అందుకోసం ఒక ఇన్చార్జిని నియమించాలని, ఈ ప్రక్రియ వెంటనే పూర్తి కావాలన్నారు. భారీ వర్షాల దృష్ట్యా జిల్లాలో ఈనెల 16, 17వ తేదీలలో అన్ని పాఠశాలలు, కళాశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్టల్స్ లకు సెలవు ప్రకటించడం చేశామని, సైక్లోన్ ప్రభావం లేకపోతే రీ కాల్ చేస్తామన్నారు. కలెక్టరేట్లో, అన్ని మండల కేంద్రాలలో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలని, వర్షాల నేపథ్యంలో ఏ సమస్య వచ్చినా తెలిపేందుకు కంట్రోల్ రూమ్ ల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈనెల 16, 17వ తేదీలలో పల్లె పండుగ కార్యక్రమం ఏర్పాటు చేసుకుని ఉంటే వాటిని ప్రజాప్రతినిధులతో మాట్లాడి తదుపరి తేదీలకు మార్చుకోవాలన్నారు. జిల్లాలో ప్రమాదకర స్థితిలో ఉన్న బ్రిడ్జిలను గుర్తించాలన్నారు. కార్పొరేషన్ లో గుర్తించిన లోతట్టు ప్రాంతాలను తనిఖీ చేయాలన్నారు. గొర్రెలు, మేకలు, పశువులకు సంబంధించి జరగకుండా చర్యలు తీసుకోవాలని, వర్షాల నేపథ్యంలో ఎలాంటి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి, వాటిని ఎలా కాపాడుకోవాలి అనే విషయమై ప్రజలకు తెలియజేయాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని ప్రతి మైనర్ ఇరిగేషన్ ట్యాంకులను తహసిల్దార్, మైనర్ ఇరిగేషన్ అధికారులు తనిఖీలు చేయాలని, ట్యాంకుల వద్ద విఆర్వో, వీఆర్ఏలను నియమించాలన్నారు. వర్షాల గురించి గ్రామాలలో టాంటాం వేయించాలని, రోజుకు ఐదు సార్లు లౌడ్ స్పీకర్ ద్వారా ప్రజలకు విస్తృతంగా తెలియజేయాలన్నారు. ఈనెల 16, 17వ తేదీలలో ప్రజలు ఎవరు ఇంటి నుంచి బయటకు రాకుండా ఉండాలని తెలపాలన్నారు. మండలాలలో వర్షాల వల్ల ప్రభావితం అయ్యే ప్రమాదకర ప్రాంతాలను గుర్తించాలన్నారు. రిజర్వాయర్లలో నీటిమట్టం ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని, ఇందుకోసం అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. అంగన్వాడి కేంద్రాలలో రైన్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్స్ ఏర్పాటు చేయాలని డ్వామా పిడిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పి సిఈఓ వెంకటసుబ్బయ్య, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, డీఆర్డీఏ పిడి ఈశ్వరయ్య, సిపిఓ అశోక్ కుమార్, ఎల్డిఎం నర్సింగరావు, డిపిఓ నాగరాజునాయుడు, డిఎంహెచ్ఓ డా. ఈబి. దేవి, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.వెంకటేశ్వరరావు, సమగ్ర శిక్ష ఎపిసి నాగరాజు, హార్టికల్చర్ డిడి నరసింహారావు, జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, హౌసింగ్ పిడి శైలజ, బీసీ వెల్ఫేర్ డిడి ఖుష్బూ కొఠారి, మైన్స్ డిడి వెంకటేశ్వర్లు, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రసూల్, డిటిసి వీర్రాజు, సర్వే ఏడి రూప్ల నాయక్, మార్కెటింగ్ ఏడి సత్యనారాయణ చౌదరి, పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
మంగళవారం 15-10-2024


# గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు

**-రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు**

**-పెండింగ్ అంగన్వాడీ భవనాలను పూర్తి చేయాలి**

**-రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాలలో పర్యటించి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల**





**ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :** గ్రామాలలో ఉన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వర రావు రఘునాథపాలెం మండలంలో పలు గ్రామాలలో పర్యటించి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రఘునాథపాలెం మండలంలో మంత్రి పర్యటించి ఎం.జి.ఎన్.ఆర్.ఈ.జి.ఎస్. నిధులు అంచనా విలువ రూ. 17.50 లక్షలతో రజబ్ అలీ నగర్ లో చేపట్టిన అంతర్గత (6) సి.సి. రోడ్డు, డ్రైనేజీ నిర్మాణ పనులకు, రూ. 30 లక్షలతో ఎన్.వి. బంజరలో చేపట్టిన (7) సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు, రూ. 87 లక్షలతో పంగిడిలో చేపట్టిన (22) సి.సి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ,హౌ డ్రైన్, రోడ్డు నిర్మాణ సమయంలో లెవల్స్ సరిగ్గా మెయింటైన్ చేయాలని లేని పక్షంలో మరిన్ని ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుందని మంత్రి అధికారులకు సూచించారు. గుడిసెలు, రేకుల షెడ్ల లలో ఉంటున్న వారి వివరాలు అందజేస్తే వారికి అర్హత మేరకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. రఘునాథ పాలెం మండలంలో పోడు పట్టాలు జారీ చేసిన గిరిజన రైతులు వారి పొలాల్లో వేసుకున్న బోర్లకు విద్యుత్తు కనెక్షన్ అందజేసేందుకు అవసరమైన అనుమతులు వెంటనే జారీ చేయాలని మంత్రి గిరిజన శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. సర్వే జరిగి మిగిలి ఉన్న పోడు భూముల పంపిణీకి చర్యలు తీసుకోవాలని మంత్రి గిరిజన అభివృద్ధి శాఖ ఉన్నతాధికారులతో చరవాణిలో ఆదేశించారు. రఘునాథపాలెం మండలంలో పెండింగ్ లో ఉన్న అంగన్వాడీ భవనాల నిర్మాణ పనులు వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలని, అవసరమైన నిధులను ప్రత్యేకంగా అందజేయడం జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. 2 లక్షలకు పైగా ఉన్న రుణాలకు ప్రభుత్వం షెడ్యూల్ ప్రకటిస్తుందని, దాని ప్రకారం లబ్ధిదారులు 2 లక్షల పైన ఉన్న రుణాలు చెల్లిస్తే ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ సొమ్ము విడుదల చేస్తుందని అన్నారు. ఎన్.వి. బంజార గ్రామంలో ఆర్.ఓ.ఎఫ్.ఆర్ పట్టాలు ఉన్న పొలాల్లో వేసిన బోర్లకు విద్యుత్ కనెక్షన్లు అందేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గ్రామంలో అవసరమైన అదనపు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని మంత్రి విద్యుత్ శాఖ ఇంజనీర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, పంచాయతీ రాజ్ డి.ఈ. యు.మహేష్ బాబు, ఏ.ఈ.- జే. చిరంజీవి,ప్రజాప్రతినిధులు, అధికారులు, పాల్గొన్నారు.

# ప్ర జా రక్షణే నా ధ్యేయం

- ఫ్రెండ్లీ పోలీసింగే ...నా లక్ష్యం...
- నేరాల నియంత్రనే నా కర్తవ్యం.

-ఆత్మకూరు డిఎస్పీ రామాంజి నాయక్



**నంద్యాల జిల్లా ఆత్మకూరు, తెలంగాణ ముచ్చట్లు :** పోలీస్.. ఈ పదం వినబడితే చాలు నేరస్తులు పరుగులు పెడతారు.. న్యాయం జరుగుతుందన్న ఆశతొ పలువురు ముందుకు వస్తారు.. తెలుగు రాష్ట్రాల్లో భాధ్యతాయుతంగా సనిచేసే పొలీసులు ఉన్నారు.. భాధ్యతలను మరిచి కటకటాలు లెక్క పెట్టిన ఖాకీలున్నారు..భాధ్యతాయుతంగా పనిచేసేవారి కన్నా భాధ్యతలను మరిచి కటకటాలు లెక్క పెట్టిన వారి ఉదంతాలే లెలుగు రాష్ట్ర ప్రజల ముందు నిత్యం కనిపిస్తుంటాయి.. మంచికన్నా చెడుపైనే ఆకర్షణ ఎక్కువగా ఉంటుండటంతొ ప్రజలు కూడా వాటిమీదే ఎక్కువ మక్కువ చూపిస్తారు.. మంచి చేసే వారికన్న చెడుచేసే వారి గురించే ఎక్కువ స్దాయిలొ ప్రచారాలు చేస్తుంటారు కొందరు..దీంతొ మంచి కాస్త మట్టి గొట్టుకు పొతుంది.. అదే పొలీస్ వ్యవస్ద పై మాయని మచ్చగా నిలుస్తుంది%ొ%.. ఇదంతా ఓ ఎత్తైతే..ఇది మరో ఎత్తు..! న్యాయం చేయడమే ధ్యేయంగా పనిచేసే వారు అరుదుగా ఉండే ఈ రోజుల్లొ కనిసించని నాలుగో సింహాగా న్యాయం చేసే అధికారులు తక్కువగా ఉన్నరు..పై స్దాయి అధికారి నిజాయితీ పరుడైతే%ొ%ఇక క్రింద స్దాయి అధికారులు కూడా నిజాయితీగా ఉంటారన్నది నగ్న సత్యం%ొ% దాన్నే రుజువు చేస్తుంది.. ఈ (డిఎస్పి)నైజం%ొ%. .ఒకప్పుడు వరుస దొంగ తన లతో వణికిన ఆత్మకూరు ఇప్పుడు కంటి నిండా నిద్రపోతుంది ఇంతమార్పా%ొ%! అవినీతి%ొ%అక్రమాలు..నేరాలు..ఘోరాల విషయంలో ముందుంగా ఉన్న నంద్యాల జిల్లా ఆత్మకూరు

ఇప్పుడు ఆ మాటలకు తావు లేదు.. ఎక్కడైనా వినపడితే సంహించేది లేదు%ొ%అక్కడక్కడా వినిపిస్తున్నా ఇకముందు వినిబడవు%ొ%ఆత్మకూరు లో ఇంత మార్పుకు కారణం ఎవరు.. నీతి నిజాయితీ తొ ఆత్మకూరు వాసులకు కంటినిండా నిద్రనిస్తూ.. అక్రమార్కుల గుండెల్లొ నిద్రపొతూ%ొ% డివిజన్ పాలన సాగిస్తున్న నేతలకు అంగ రక్షకుడిగా గా ఉంటూ లా అండ్ ఆర్డర్ ను పూర్తిగా కంట్రోల్ చేస్తున్నారు ఒకే.. ఒక్క ఈ డిఎస్పి శరామాంజి నాయక్ %ొ%. పొలీస్%ొ%.. పొలీస్ అన్న మాటను గాంభీర్యంగా పలకాలన్న ఆత్మకూరు డిఎస్పి రామాంజి నాయక్ సిధ్ధాంతం ఆత్మకూరు ను మార్చే షింధి భాధ్యతలను స్వీకరించిన ఆయన అన్ని శాఖల నుంచి సహకారం కావాలన్నారు%ొ%అందరూ కలిస్తేనే అధ్భుతమైన ఆత్మకూరు గా మార్చొచ్చు అన్నారు.. ఆ దిశగా అడుగులు ముందేశారు.. వచ్చి రావడంతోనే. వరుస దొంగ తానా లను చెక్ పెట్టారు%ొ%మూడు నెలల వ్యవధిలొనే ఆత్మకూరు డివిజన్ పరిధిలొ ఉన్న ( క్రైం ) ను ఊడ్చిపారేశారు%ొ%గుట్కా విక్రయదారులను గుటకలు మింగించారు..కల్తీ గాళ్ల కల్తీ విదిలిచ్చారు.. బియ్యం మాఫియా సిగ్నల్ కట్ చేశారు%ొ%.ఆర్దిక నేరాలకు పాల్పడుతున్న వారికి ముచ్చెమటలు పట్టించారు.. పొలీస్ వయ్యవస్ద పై ఉండే ఓ సింత మచ్చను కడిగేసి శభాష్ పొలీస్ అన్న మాటలే వినపడేలా చేశారు%ొ%రాజకీయ సిఫార్శులకు లొంగ కుండా ఉండటం ఆయన . వంతుగా ఉంటే సిపార్శులు చెయ్యడం మానేయడం నేతల వంతైంది..మంచికి సిఫార్శు చెయ్యండి ముందుంటాను.. చెడును చూపించండి నివారిస్తాను అన్న ఆయన మాటలు వినడం మీడియా వంతైంది%ొ%. ఏదేమైనా ఆయన లా ప్రతి ఖాకీ ఒక్కరోజు పనిచేస్తే ఆ రోజు మొత్తం మీద కలిగే ఆనందం విలువ కట్టలేనిది%ొ% వారు చేసే న్యాయం విమర్శించలేనిది%ొ%వారు చేసే ప్రతిపని వేల దీవెనలను అందుకుంటుంది%ొ%సెల్యూట్ డిఎస్పి రామాంజి నాయక్ ..సెల్యూట్ ది గుడ్ పొలిసింగ్

# వర్షాల సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండండి

- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ



**నెల్లూరు,తెలంగాణ ముచ్చట్లు :** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా 14, 15, 16 తేదీల్లో విస్తారంగా వర్షాలుంటాయని అధికారులు ప్రజలు 24×7 అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రివర్యులు డాక్టర్ పొంగూరు నారాయణ సూచించారు. నెల్లూరు మంత్రి క్యాంపు కార్యాలయం నుండి ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల ముప్పు వాటిల్లకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతోపాటు మున్సిపల్ వ్యవస్థ, కార్పొరేషన్ వ్యవస్థ, రెవెన్యూ వ్యవస్థ, పోలీస్ వ్యవస్థ, విపత్తు నిర్వహణ శాఖ అధికారులు 24%ఇ%7 అప్రమత్తంగా ఉండాలని మంత్రి నారాయణ సూచించారు. కంట్రోల్ రూమ్, హెల్ప్ లైన్ లు ఏర్పాటు చేసి అధికార యంత్రాంగం సంసిద్ధంగా ఉండాలన్నారు. వర్షాలు కురవనున్న నేపథ్యంలో గండ్లు పడే కాలువలు, గట్లను గుర్తించి పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రధానంగా లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించాలని సూచించారు. ప్రధానంగా వర్షపు నీటి ప్రవాహానికి సంబంధించి సైడ్ కాలవల్లో సిల్ట్ తీసేందుకు ఎక్కడికక్కడ చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడ కూడా వర్షపు నీరు నిలువ లేకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. ఎక్కడ ఏ సమస్య వచ్చినా వెంటనే నివారణ చర్యలు చేపట్టేందుకు, ప్రజలను సురక్షితంగా ఉంచేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు తెలియజేశారు. అవసరమైతే లోటంత ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు.

# మందపల్లి లంక భూములు పై సెక్షన్ 22/ఏ ను తొలగించండి

**- కొత్తపేట ఆర్డీవోకు రైతులు వినతి**



**కొత్తపేట, తెలంగాణ ముచ్చట్లు :** కొత్త పేట మండల పరిధిలోని కొత్త పేట మందపల్లి కేదార్లంక లంక భూములు పై ఉన్న 22/ఏ సెక్షన్ తొలగించాలని కోరుతూ కంఠంశెట్టి శ్రీను ఆధ్వర్యంలో గుబ్బల మూర్తి లంక భూమల రైతులు కొత్త పేట ఆర్డీ వో కార్యాలయం నందు జరిగిన గ్రీవెన్స్ లో వినతిపత్రం సమర్పించారు. సెక్షన్ 22/ఏ వలన లంక భూమి రైతులకు ఇబ్బంది కరంగా ఉందని రైతులకు ఎంతో నష్టం కలిగిస్తుందని ఆర్డీవో కు తెలియజేశారు. ఎన్నో సంవత్సరాలుగా తమ స్వాధీనంలో ఉన్న జిరాయితీ భూములకు రిజిస్ట్రేషన్ లావాదేవిలు జరగడం లేదని తెలిపారు. గత రెండు సంవత్సరముల వరకు ఎటువంటి ఇబ్బంది లేదని సెక్షన్ 22/ఏ చేర్చినప్పటినుండి బ్యాంకు లలో రుణాలు ఇవ్వడం లేదు. ప్రభుత్వం రైతులకు అందించే పథకాలు అందటం లేదు. రైతులకు ఎటువంటి లబ్ధి చేకూరడం లేదు. ఈ భూములన్నీ చిన్న కారు రైతులు చెందినవే కావడంతో వారు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆర్డీవో వద్ద రైతులు వాపోయారు.కనుక తక్షణమే సెక్షన్ 22/%ూ% తొలగించి రైతులను ఆదుకోవాల్సిందిగా కంఠంశెట్టి శ్రీనివాస్ గుబ్బల మూర్తి ఆర్డీవో పి. శ్రీకర్ ను కోరారు. ఈ మేరకు మందపల్లి, కొత్తపేట, కేదార్లంక మూడు గ్రామాలకు చెందిన రైతులు వినతిపత్రం అందించారు..

# జడివానలో పల్లె పండగ..!

**జలదంకి, తెలంగాణ ముచ్చట్లు :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ కార్యక్రమాన్ని ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ అట్టహాసంగా ప్రారంభించారు. ఉదయగిరి నియోజకవర్గం లోని జలదంకి మండలం, జలదంకి మరియు జమ్మలపాలెం గ్రామంలో జడివానను సైతం లెక్కచేయక స్థానిక మండల నాయకులు గ్రామ నాయకులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. జలదంకి లో 20 లక్షలు జమ్మలపాలెం గ్రామంలోని మిక్సిడ్ కాలనీలో 20 లక్షల రూపాయలతో నిర్మించబోతున్న సిసి రోడ్డు కు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా శిలాఫలకాన్ని ఆవిష్కరించి, సిసి రోడ్డు శంకుస్థాపనకు కొబ్బరికాయ కొట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఉపముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ సారధ్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి గ్రామ సభలు నిర్వహించి గ్రామంలోని ముఖ్యమైన సమస్యలను అర్జీల రూపంలో తెలుసుకోవడం జరిగిందని, వాటి పరిష్కారం కోసం పల్లె పండుగ కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈనెల 14వ తేదీ నుండి అనగా ఈరోజు సోమవారం నుండి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతిరోజు ఒక మండలం లో పల్లె పండుగ కార్యక్రమంలో పాల్గొంటానన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధుమోహన్ రెడ్డి ఎంపీపీ గోచిపాతల వెంకటరమణయ్య జడ్పిటిసి మేదరమెట్ల శివ లీలమ్మ సర్పంచ్ బుర్రి వేణి జాజుల కోటేశ్వరరావు నక్కా మాధవరావు పి మాలకొండయ్య సింగమనేని మనోజ్ కుమార్ కుట్టు బోయిన మాధవరావు పొట్లూరు వెంగమ్మ చలంచర్ల అనురాధ తదితరులు ఉన్నారు.

# స్మశాన భూములు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలను గుర్తించాలి

**బాపట్ల, తెలంగాణ ముచ్చట్లు :** స్మశాన భూములు లేని ఎస్సీ, ఎస్టీ కాలనీలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్ లో జరిగింది. జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితులు తమ సమస్యలపై వినతి పత్రాలను అందించారు. న్యాయం చేయాలని కలెక్టర్ ను కోరారు. తన పరిధిలోని వాటికి కలెక్టర్ అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

# మతం మెలికను రద్దు చేయాలి

## విశ్రాంత అదనపు డిజిపి కూచిపూడి బాబూరావు



**తెలంగాణ ముచ్చట్లు :** ఢిల్లీ లో జస్టిస్ కె జి బాలకృష్ణన్ ను ఢిల్లీ లో కలసిన ప్రతినిధి బృందం నవంబరులో తెలుగు రాష్ట్రాల పర్యటన : ఎంక్వయిరీ కమీషన్ చైర్మన్ జస్టిస్ కె జి బాలకృష్ణన్, మతం మెలికను దళితుల మెడకు చుట్టి రాజ్యాంగ ఫలాలను దళితులకు దూరం చేసిన 1950 లో ఇచ్చిన షెడ్యూల్డు కులాల రాష్ట్ర పతి ఉత్తర్వు ను రద్దు చెయ్యాలని కోరుతూ విశ్రాంత అదనపు డిజిపి డాక్టర్ కూచిపూడి బాబూరావు నేతృత్వంలో తెలుగు రాష్ట్రాల నుండి మేధావుల బృందం ఎంక్వైరీ కమీషన్ చైర్మన్ జస్టిస్ కె జి బాలకృష్ణన్ ను కలిసింది, డెబ్బై నాలుగు సంవత్సరాల గణతంత్ర దేశ చరిత్ర లో దళితుల మెడకు బిగించిన మతం మెలికను ఎత్తి వేయడానికి తగిన సిఫారసు చెయ్యాలని కోరడం జరిగింది, ఈ ఉత్తర్వు వలన దళితులు మతపరంగా విభజించబడ్డారని, ఏ మతంలోని దళితులకైనా కులపరంగా వివక్ష ఉందని, ఆ వివక్ష రూపాలను , వివక్ష జరుగుతున్న తీరును తెలియచెప్పారు, ఈ ఉత్తర్వు వలన క్రైస్తవ దళితులు షెడ్యూల్డు కులాల కు కల్పించే ప్రభుత్వ పథకాలను పొందలేక పోతున్నారని, అంతే కాకుండా విద్య ఉద్యోగాలలో కొనసాగుతున్న వివక్షను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసారు, మతం, సంస్కృతి సంప్రదాయాలు ఆయా భౌగోళిక పరిస్థితుల ఆధారంగవుంటాయని, సాంస్కృతిక విషయాలను గుర్తించాలని, అదే కోణంలో భారత దేశంలో క్రీస్తు పూర్వమే నెలకొన్న హిందూ మతాన్ని అందులోని కులాన్ని పరిగణన లోకి తీసుకోవాలని ఎక్కడో ఇజ్రాయేలులో పుట్టిన క్రైస్తవ మతం లో కులం లేదు కాబట్టి భారత దేశంలో క్రైస్తవంలో కి చేరే దళితులకు కుల వివక్ష వుండదనే సూత్రీకరణల ఆధారంగా క్రైస్తవం తీసుకునే దళితులను షెడ్యూల్డు కులాల వారిగా గుర్తించనని చెప్పడం అర్థం లేనిదని, ఇజ్రాయెల్, ఇతర క్రైస్తవ దేశాలలో రంగు, జాతి వివక్ష అక్కడ వున్నదని, ఆ దేశాలలో హిందూ మతం పుట్టలేదు కాబట్టి అక్కడ కుల వివక్ష లేదని , భారత దేశంలో హిందూ మతం వుండడం వలన భారత దేశ మంతటా కుల వివక్ష విస్తరించిందని, భారత్ లో అన్ని మతాలలో కులం వుంటుందని అక్కడ అన్ని మతాలలో జాతి , రంగు లను బట్టి వివక్ష వుంటుందని భారత దేశంలో వుండే అన్ని రకాల మతాలలో కులం వుంటుందని భారతీయులు అధికంగా వలస పోతున్న అభివృద్ధిచెందిన దేశాలలో కుల వివక్ష ఆరంభమయ్యిందని జస్టిస్ బాలకృష్ణన్ అడిగిన ఒక ప్రశ్నకు డాక్టర్ బాబు రావు వివరణ ఇచ్చారు, నాటి రాష్ట్ర పతి ఉత్తర్వు నేటికీ దళితుల జీవితాల మీద ప్రభావం చూపుతున్నదని, ప్రాథమిక హక్కుల ను, జీవించే హక్కును , ఇష్టమైన దేవుణ్ణి ఆరాధించే హక్కును దళితులు మాత్రమే కోల్పోతున్నారని, తద్వారా దళితుల ఆత్మ గౌరవం దెబ్బతింటున్నదని సీనియర్ జర్నలిస్ట్, ప్రముఖ రాజకీయ సామాజిక విశ్లేషకులు డాక్టర్ పులుగుజ్జు సురేష్ కమిషన్ దృష్టికి తీసుకొచ్చారు, మాదిగ, మాల, ప ర య, పులయ వంటి కులాల పేరుతో వివక్ష కొనసాగుతూనే వున్నదని ఈ విషయాన్ని 2007 వ సంవత్సరంలో జస్టిస్ రంగనాథ్ మిశ్రా కమిషన్ రుజువు చేసిందని బ్రదర్ జోస్ డేనియల్ చెప్పారు, పోలీస్ లు ఎఫ్ ఐ ఆర్ నమోదు సమయంలో ఏ మతం వారికైనా కులం తప్పకుండా రికార్డు చేయాలని అటువంటప్పుడు దళితులు ఏ మతంలో వుంటే ఏముందని తెలంగాణ హైకోర్టు లాయరు చాట్ల సుధీర్ అన్నారు , సామాజిక, ఆర్థిక , రాజకీయ రంగాల్లో దళితులు రాణించాలంటే అడ్డంకిగా ఉన్న 1950 రాష్ట్రపతి ఉత్తర్వును రద్దు చేయడం తప్ప మరొక మార్గం లేదని విన్నవించారు, అనేక రకాల అభిప్రాయాలు విన్న తరువాత నవంబరు మాసంలో ఆంధ్ర తెలంగాణకు రాష్ట్రాలు పర్యటిస్తానని తమ వాదనలు క్షేత్ర స్థాయి పర్యటనలో తెలియజేయాలని జస్టిస్ బాలకృష్ణన్ ప్రతినిధి బృందానికి తెలియజెప్పారు, ప్రతినిధి బృందంలో ఫా. అంతోనిరాజ్ సిబిసీఐ సెక్రటరీ, బిషప్ వీరాజీ ఇజ్రాయెల్, గోనె సాల్మన్ రాజ్ , సిస్టర్ అనేయ ఫెర్నాండెజ్, తదితరులు పాల్గొన్నారు

# భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలి

## - కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

**ప్రకాశం, తెలంగాణ ముచ్చట్లు :** ప్రకాశం జిల్లా ఒంగోలు అధికారులను ఆదేశించారు. జిల్లాలోని విద్యాసంస్థలకు మంగళవారం కూడా సెలవు ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. అత్యవసరమైతే తప్ప రాబోయే నాలుగు రోజులపాటు ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. వర్షాల ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ముఖ్యమంత్రి శ్రీ.నారా చంద్రబాబు నాయుడు సోమవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. అనంతరం వివిధ శాఖల జిల్లా అధికారులు, మండలాల స్పెషల్ ఆఫీసర్లు,హా తహసీల్దారులతో కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి రాష్ట్ర ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలను వివరించి, వాటిని అమలు చేసేందుకు తీసుకోవలసిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. భారీ వర్షాల దృష్ట్యా మరో నాలుగు రోజులపాటు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా తీరప్రాంత మండలాల అధికారులు పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఉండాలని ఆమె అన్నారు.

**గర్భిణులు, బాలింతలపై ప్రత్యేక దృష్టి**

మరో వారం రోజుల్లో ప్రసవించే అవకాశం ఉన్న మహిళలను ఆసుపత్రులలో చేర్పించాలని వైద్యాధికారులకు కలెక్టర్ చెప్పారు. చిన్నారులు,హా వికలాంగులు, వృద్ధులు, బాలింతలు ఎలాంటి ఇబ్బందులకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులనుహా ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఉంటున్న ప్రజలను తక్షణమే తుఫాను షెల్టర్ల కేంద్రాలకు, పునరావాస శిబిరాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఆయా కేంద్రాల్లో ప్రజలకు అవసరమైన వసతులు కల్పించడంతో పాటు రోగులకు అవసరమయ్యే మందులను కూడా అందించాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పునరావాస శిబిరాలలో ఆశ్రయం పొందుతున్న వారికి అవసరమైన నిత్యావసరాలు అందించేలా తగిన మోతాదులో సరుకులను సమకూర్చి పెట్టుకోవాలని జిల్లా పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. మంగళవారం విద్యాసంస్థలకు సెలవు భారీ వర్షాల దృష్ట్యా మంగళవారం కూడా జిల్లాలోని అన్ని అంగనవాడీలు, పాఠశాలలు, కాలేజీలకు సెలవు ప్రకటిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఏవైనా సంక్షేమ హాస్టళ్ళు ప్రమాదకర స్థితిలో ఉంటే వాటిలో ఆశ్రయం పొందుతున్న విద్యార్థులను తక్షణమే ఇతర హాస్టల్లోకి, సమీపంలోని సురక్షిత భవనాల్లోకి తరలించాలని అధికారులకు ఆమె దిశ నిర్దేశం చేశారు.

**పంట నష్టం నివారించాలి**

భారీ వర్షాల వలన పంటలు నీట మునగకుండా చూడాలని, ఈ విషయంలో రైతులకు అవసరమైన సూచనలు, సలహాలు ఇవ్వాలని



వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మత్స్యకారులు సముద్రంలోకి చేపల వేటకు వెళ్లకుండా చూడాలని,హా వారి పడవలను కూడా తీరంలో లంగరు వేసేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. లోతట్టు ప్రాంతాల్లో నీళ్లు నిలవకుండా మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు తోడేలా చర్యలు తీసుకోవాలనిహా కలెక్టర్ ఆదేశించారు. పట్టణాలలో ప్రమాదకర స్థితిలో ఉన్న హోర్డింగులను తక్షణమే తొలగించాలని స్పష్టం చేశారు.

సిబ్బంది మొత్తం ఫీల్డ్ లోనే.పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు, విద్యుత్తు, రెవెన్యూ, పోలీసు, నీటి పారుదల, వైద్య, గ్రామీణ నీటి సరఫరా శాఖల సిబ్బంది, పారిశుధ్య కార్మికుల సెలవులు రద్దు రద్దు చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సిబ్బంది అందరూ క్షేత్రస్థాయిలో నిరంతరం వచ్చే నాలుగు రోజుల పాటు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె చెప్పారు. రోడ్లు దెబ్బతిన్నా, కాలువలకు, చెరువులకు ఇతర నీటి వనరులకు గండ్లు పడినా, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినా సత్వరమే పరిస్థితి సరిచేసేలా సన్నద్ధమై ఉండాలని ఆమె చెప్పారు. ప్రమాదకర స్థితిలో ఉన్న వాగులు, కాలువల వైపు ప్రజలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు పెట్టడంతో పాటు రెవెన్యూ, పోలీసు, ఇతర శాఖల సిబ్బంది అక్కడ గస్తీ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు.

**వివిధ స్థాయిలలో కంట్రోల్ రూములు**

ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తున్నామని, వివిధ శాఖల మధ్య సమన్వయం కోసం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 1077 టోల్ ఫ్రీ నెంబరుతో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని చెప్పారు.

# పల్లె పండగ వారోత్సవాలు

## -హోలహర్వి గ్రామానికి వివిధ పనులకు 63 లక్షలు మంజూరు
## -10 లక్షల సిసి రోడ్లు డ్రైనేజీ లకు
## - జల్జీవన్ మిషన్ కింద 900 కుళాయి ఇంటింటికి మంజూరు చేసిన ఘనత బి వి జె
## - జగన్ ప్రభుత్వం ఐదు సంవత్సరాలు చేసింది శూన్యం అభివృద్ధి లేదు... బీవీజే





**నందవరం మండలం, తెలంగాణ ముచ్చట్లు :** నందవరం మండల పరిధిలో హోలహర్వి గ్రామం గ్రామ పంచాయతీలో జగ్గాపురం ఈ పంచాయతీలకు ముందుగా ఎమ్మిగనూరు నియోజకవర్గ శాసనసభ్యులు బీవీ జయ నాగేశ్వర్రెడ్డి ఆధ్వర్యంలో 10 లక్షల సిసి రోడ్లు డ్రైనేజీ లకు,మినీ గోకులం షెడ్ కు భూమి పూజ చేశారు. అదేవిధంగా ఇంటింటికి తిరుగుతూ వారి సమస్యలు అడిగి తెలుసుకుని వీధి వీధి లకు సీసీ రోడ్లు డ్రైనేజీలు మంజూరు చేశామని ఆ గ్రామ ప్రజలకు తెలిపారు. గత ప్రభుత్వంలో మీ సమస్యల్ని అడిగిన నాథుడు లేడని ఆయన అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారు ప్రవేశపెట్టిన పల్లె పండుగ వారోత్సవాలు జరుపుకొనుటకు ఈనెల 20 తేది వరకు జరుగుతాయని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన నడుచుకుంటూ,నాలాబండ వీధి, పింజారి గేరి, సి సి రోడ్డు, వీధి వీధికి పది లక్షలు మంజూరు చేశారు. 22తేదీ ప్రజా ధర్బార్ నందవరం లో ఉంటుంది ఎవరైనా ఇంకా సమస్యలు ఉంటే నందవరంకు రావాలని ఆయన తెలియజేశారు. జగన్ ప్రభుత్వంలో ఐదు సంవత్సరాలు అభివృద్ధికి ఈ గ్రామాలు నోచుకోలేదని ఆయన పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు అయినా కాలేదు 900 వందల కుళాయి లు ఫ్రీ ఇస్తాం,మినీ గోకులం 2,30లక్షలు ఎం ఎన్ ఆర్ ఈ జి ఎస్ క్రింద, తిక్కయ్య,అనే వేక్తి మంజూరు చేశారు.అదేవిధంగా భూమి పూజ చేశారు.సచివాలయం, రైతు భోరోసా కేంద్రమును ప్రారంభించారు.అదేవిదంగా కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అభివృద్ధి పండుగ ప్రారంభించిన ఘనత జయ నాగేశ్వర్ రెడ్డి కె దక్కింది అన్నారు. గత ప్రభుత్వంలో ఇల్లు కట్టుకున్న లబ్ధిదారులు 86 మంది ఉంటే వారికి కనీసం ఒక్క రూపాయి మాత్రమే పడింది తప్ప మిగతా డబ్బులు కూడా పడలేదు దాదాపుగా జగ్గాపురం హోలహర్వి గ్రామాలలో140 ఇండ్లు మంజూరు అయితే జగన్ ప్రభుత్వం వాటిని పట్టించుకున్న పాపాన పోలేదు గత ప్రభుత్వంలో బిల్లు కానీ ఇండ్లకు కూడా రెండు లక్షల రూపాయలు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. కొత్తగా ఇల్లు కట్టించుకునే వాళ్లకు మార్చి 31వ తేదీ లోపు ఆన్లైన్ చేసుకోవాలని ఆయన సభాముఖంగా తెలియజేశారు.ఈ కార్యక్రమంలో తాసిల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో పుల్లయ్య, ఏపీవో శ్రీనివాసులు, ఏపిఎం రాఘవేంద్ర, పంచాయతీరాజ్ శాఖ అధికారులు హౌసింగ్ అధికారులు యు ఓ ఆర్ డి,ఎంఈఓ, అంగన్వాడి సూపర్వైజర్, టిడిపి నాయకులు జగన్నాథ రెడ్డి, మండల కన్వీనర్ చిన్నరాముడు, మండల క్లస్టర్ ఇంచార్జి కాసింవాలి, ధర్మాపురం గోపాలు నాగరాజు,ఎస్సీ సెల్ అధ్యక్షులు దావీదు టిడిపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# జి కె డెవలప్మెంట్ రియల్ ఎస్టేట్ ప్రారంభోత్సవం



గుంటూరు అక్టోబర్ 13: గాదే కిషోర్ డెవలప్మెంట్ రియల్ ఎస్టేట్ ఆఫీసు ప్రారంభోత్సవం మహాత్మా గాంధీ ఇన్నర్ రింగ్ రోడ్డు అగతవరప్పాడు మెయిన్ రోడ్డు వద్ద అగతవరప్పాడు గ్రామ ప్రజలు, అభిమానులు, స్నేహితులు, బంధువులు మధ్య ఘనంగా జరిగింది. జీకే డెవలప్మెంట్ రియల్ ఎస్టేట్ అధినేత గాదే కిషోర్ మాట్లాడుతూ అగతవరపాడు గ్రామ సర్పంచ్ గా గ్రామంలోని ప్రతి ఇంటికి వాటర్ పైప్ లైన్ ద్వారా కొళాయిలు ఏర్పాటు చేశానని ఎన్నో సంవత్సరాల నుండి ఉన్న నీటి సమస్యలను తీర్చినందుకు నాకు ఎంతో ఆనందంగా ఉన్నదని, గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపిన నాకు సర్పంచి పదవి కాలం అనంతరం గ్రామస్తులు, శ్రేయోభిలాషుల కోరిక మేరకు జీకే డెవలప్మెంట్ రియల్ ఎస్టేట్ ను ప్రారంభించడం జరిగిందని, పేద, మధ్య తరగతి ప్రజల కు 200,500 గజాలు మరియు వారి కోరిక మేరకు ఎంతైనా స్థలం తక్కువ రేటుకు, మంచి స్థలాలు, ఎలాంటి వివాదం లేని స్థలాలు ఉడ లేఔట్ అప్రూవల్ లో లీగల్ గా అన్ని అనుమతులు ఉన్న స్థలాలను కస్టమర్లకు ఇప్పించటం మా సంస్థ ఏకైక లక్ష్యంగా పనిచేస్తామని, గ్రామ ప్రజలకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో జీకే రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రారంభించడం జరిగిందని తక్కువ ధరలకు అగతవరపాడు, ఇన్నార్ రింగ్రోడ్ గుంటూరు పరిసర ప్రాంతాల్లో కస్టమర్లకు నాణ్య మైన స్థలాలు ఇప్పించాలని ఉద్దేశంతో ఈ రియల్ ఎస్టేట్ ను ప్రారంభించామని, స్థలం కొరదలిచిన అమ్మదల్చిన తమ సంస్థను సంప్రదించాలని మీరు సంతృప్తి పడే విధంగా కస్టమర్ల కోరికకు అనుగుణంగా మా ఆలోచనలు ఉంటాయని, కస్టమర్లు ఏ సమయంలో ఫోన్ చేసినా లేదా మా ఆఫీసుకు వచ్చిన వెంటనే మేము మా సేవలను అందిస్తామని సంతోషంగా రండి రెట్టింపు ఆనందంతో వెళ్ళండన్నారు.

# సినిమా న్యూస్



# సన్నని నడుముతో మాయ చేస్తోన్న సిమ్రాన్ పాప



తెలుగమ్మాయి సిమ్రాన్ చౌదరి హమ్ తుమ్ అనే సినిమా సినిమా ద్వారా టాలీవుడ్‌లో అడుగుపెట్టిన విషయం తెలిసిందే. ఇక 2017లో ఫెమినా మిస్ తెలంగాణ టైటిల్‌ను గెలుచుకున్న అమ్మడికి టాలీవుడ్ లో అవకాశాలు పెరిగాయి. ఆ తరువాత మోడలింగ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ముఖ్యంగా ఈ నగరానికి ఏమైంది సినిమాలో నటించడం ద్వారా ఆమె కెరీర్ యూ టర్న్ తీసుకుంది. తర్వాత బొంబాట్, చెక్, పాగల్, సెహరి తదితర సినిమాలలో కనిపించింది. అల్లరి నరేష్ హీరోగా నటించిన ఆ ఒక్కటి అడక్కు సినిమాలో సిమ్రాన్ చిన్న పాత్రలో మెరిసింది. అలాగే లవ్ మీ అనే సినిమాలో కీలక పాత్రలో నటించింది. కానీ ఇప్పటివరకు గ్లామర్ రోల్స్‌లోనే ఎక్కువగా కనిపిస్తోంది. మరింత ప్రభావవంతమైన పాత్రలో నటించి తన ప్రతిభను ప్రూవ్ చేసుకునే అవకాశం కోసం ఎదురుచూస్తుంది. సినిమాలతో పాటు మోడలింగ్‌లో కూడా రాణిస్తూ ఉంటుంది. సిమ్రాన్ చౌదరి సోషల్ మీడియాలో చాలా యాక్టివ్. ముఖ్యంగా ఇన్‌స్టాగ్రామ్ ద్వారా తన ఫోటోలు, వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను పంచుకుంటూ అభిమానులతో కలిసిపోతుంది. తన గ్లామరస్ ఫోటోషూట్‌లు, యాక్టివిటీస్ వైరల్ అవుతూ ఉంటాయి. సిమ్రాన్ చౌదరి ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ ఫోటోలు ఆమె సింప్లిసిటీ, గ్లామర్ ని హైలెట్ చేస్తున్నాయి. డెనిమ్ జీన్స్, సన్నని టాప్‌లో కూల్ లుక్‌లో కనిపిస్తూ, ఆమె నేచురల్ హ్యూమర్‌తో అభిమానుల హృదయాలను గెలుచుకుంటోంది. వర్షాన్ని ఆస్వాదిస్తూ మంచి క్యాప్షన్‌లతో రోజువారీ జీవితాన్ని ఆనందంగా ఎలా చూడాలో చెబుతోంది. ఈ పోస్టు మంచి స్పందన పొందుతూ, కామెంట్లలో ఆమె ఫ్యాన్స్ పొగడ్తల వర్షం కురిపిస్తున్నారు. ఇక ఆమె కెరీర్ విషయానికి వస్తే ప్రస్తుతం ఒక తెలుగు సినిమాతో పాటు తమిళంలో కూడా చిన్న బడ్జెట్ సినిమాలో ఛాన్స్ అందుకున్నట్లు సమాచారం. త్వరలోనే ఒక వెబ్ సిరీస్ ప్రాజెక్టుతో బిజీ అవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే సిమ్రాన్ ఒక మంచి హిట్ కోసం ఎదురుచూస్తోంది. మంచి సక్సెస్ అందుకొని ఫామ్ లోకి రావాలని అనుకుంటోంది. మరి ఆమెకు వచ్చే అవకాశాలు ఎలాంటి ఫలితాన్ని అందుకుంటాయో చూడాలి.

# హీరోయిన్ నడుముపై చపాతీలు వేడి చేయిస్తానన్న సౌత్ డైరెక్టర్!




గత కొద్ది రోజులుగా వరుస ఇంటర్వ్యూల్లో సంచలన వ్యాఖ్యలు చేస్తోంది మల్లికా షెరావత్. బాలీవుడ్ అంతర్గత విషయాలు సహా సౌత్ లో తనకు ఎదురైన అనుభవాల గురించి పూసగుచ్చి నేషనల్ మీడియాకు చెబుతుంటే అవన్నీ సంచలనాలుగా మారుతున్నాయి. ప్రస్తుతం బాలీవుడ్‌లో తాజా విడుదల విక్కీ విద్యా కా వో వాలా వీడియో లో తన పాత్రతో మల్లిక వార్తల్లో నిలుస్తోంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా మల్లిక చాలా మీడియా సంస్థలతో మాట్లాడు తోంది. ఎప్పటిలాగే మల్లిక బోల్డ్ గా రిఫ్రెషింగ్‌గా కొత్త విషయాలను మాట్లాడుతోంది. హాటర్‌ఫ్లై తో మాట్లాడిన మల్లిక మనుషుల వక్ర దృష్టి, చెడు కన్ను గురించి కూడా చర్చించింది. మర్డర్ సినిమాలో బోల్డ్ పాత్రలో నటించినందుకు తనను ప్రజలు ఎలా చూసేవారో వెల్లడించింది. తాను బయట కూడా అలా ఉంటానని భావించారని, కానీ ఫిలింమేకర్స్ అలాంటి దృష్టితో చూసినప్పుడు అవకాశాల్ని తిరస్కరించానని కూడా మల్లిక వెల్లడించారు. అదే సమయంలో ఒక సౌత్ దర్శకుడితో తన అనుభవం గురించి ఓపెనైంది. సౌత్‌లో ఓ పాట చిత్రీకరిస్తున్నప్పుడు జరిగిన సంఘటనను ప్రస్తావించింది మల్లిక. ఒక సౌత్ డైరెక్టర్ తన సినిమాలో హాలి ఐటెం సాంగ్ ఉందని దానిలో నర్తించాలని అడిగారు. ఈ పాట ఎలా ఉండాలి? అంటేచూసే ప్రేక్షకులకు మీరెంత హాలి అనేది అర్థమవ్వాలని అన్నాడు. దానికి ఓకే చెప్పాక... తెరపై నన్ను ఎలా చూపిస్తున్నారు? అని నేను ప్రశ్నించాను. మీ నడుముపై చపాతీలు వేడి వేడిగా వేయిస్తాను%--% అని చెప్పాడు. ఆ కొంటె జవాబుకి నేను షాక్ తిన్నాను. నేను ఈ ఐటమ్ పాటలో చేయను అని చెప్పేశాను! అని మల్లిక వెల్లడించింది. అయితే మల్లిక ఆ డైరెక్టర్ ఎవరు? అన్నది చెప్పకపోవడంతో ఇప్పుడు అందరూ ఆరాలు తీసే పనిలో ఉన్నారు. ఇంతకీ మల్లికను అలా అడిగిన డైరెక్టర్ ఎవరై ఉంటారు?

# సమంత.. ఖర్చు పెట్టడంలో బిజీబిజీగా..



సౌత్ ఇండియా స్టార్ హీరోయిన్ సమంత దశాబ్దం పాటు తెలుగు, తమిళ భాషలలో తిరుగులేని ఇమేజ్ తో నటిగా దూసుకుపోయింది. అయితే గత ఏడాది వచ్చిన 'ఖుషి' తర్వాత సమంత స్పీడ్ కి కాస్తా బ్రేక్స్ పడింది. ఈ బ్రేక్ కావాలని ఆమెనే తీసుకుంది. కొంతకాలం శారీరక, మానసిక ప్రశాంతత కోసం విశ్రాంతి తీసుకోవాలని డిసైడ్ అయ్యి కెరియర్ కి బ్రేక్ ఇచ్చింది. మరల ఇప్పుడు కథలు వింటుంది. బాలీవుడ్ లో కొన్ని ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్స్ లలో సమంత భాగం అయినట్లు టాక్ వినిపిస్తోంది. వెబ్ సిరీస్ లకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే ఇంకా ఏవీ అధికారికంగా ఎనౌన్స్ కాలేదు. మరో వైపు సమంత సొంత ప్రొడక్షన్ హౌస్ స్టార్ట్ చేసిన సంగతి తెలిసిందే. ట్రాలల మూవింగ్ పిక్చర్స్ బ్యానర్ ప్రారంభించి 'మా ఇంటి బంగారం' అనే సినిమాని మొదటి ప్రాజెక్ట్ గా ఎనౌన్స్ చేసింది. ఫీమేల్ సెంట్రిక్ కథతో తెరకెక్కనున్న ఈ చిత్రంలో సమంత లీడ్ రోల్ లో నటిస్తోంది. అయితే ఈ మూవీ ప్రీప్రొడక్షన్ వర్క్ స్టేటస్ ఏంటనే దానిపై క్లారిటీ లేదు. ఇదిలా ఉంటే తన ప్రొడక్షన్ లో ఇతర హీరో, హీరోయిన్స్ తో కూడా సమంత మూవీస్ చేయాలని అనుకుంటుందంట. బ్యాక్ టూ బ్యాక్ ప్రాజెక్ట్స్ చేయాలని డిసైడ్ అయ్యిందంట. ఓ వైపు యాక్టర్ గా కొనసాగుతూనే మరో వైపు ఫుల్ టైమ్ ప్రొడ్యూసర్ గా మారాలని సమంత ఫిక్స్ అయినట్లు టాక్ వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో తన ప్రొడక్షన్ లో రెండో సినిమాని ప్రియదర్శి హీరోగా కన్ఫర్మ్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. త్వరలో ఈ సినిమాకి సంబందించిన అఫీషియల్ ఎనౌన్స్ మెంట్ రానుందని ఇండస్ట్రీ వర్గాలలో మాట్లాడుకుంటున్నారు. నిర్మాతగా తన బ్యానర్ లో కథ ప్రాధాన్యం ఉన్న చిత్రాలు చేయాలని సమంత అనుకుంటుందంట. మంచి కథ దొరికితే ఖర్చు చేయడానికి ఏమాత్రం వెనుకాడకుండా బిజీ అవుతున్నట్లు తెలుస్తోంది. ఆమె లేటెస్ట్ ట్రెండ్ కు తగ్గట్టుగా భిన్నమైన కథలు వినడానికే ఇష్టపడుతుందని చర్చ నడుస్తోంది. తెలుగుతో పాటు తమిళ్, హిందీ భాషలలో కూడా ఆమె మూవీస్ నిర్మించాలని ప్లాన్ చేసుకుంటుంది.

# గోపిచంద్ విశ్వం.. బాక్సాఫీస్ పరిస్థితేంటి?



'లౌక్యం' తర్వాత ఆ స్థాయిలో సాలిడ్ సక్సెస్ కోసం గోపీచంద్ ఎదురుచూస్తున్నారు. ఆ మూవీ తర్వాత గోపీచంద్ ఇప్పటి వరకు 11 సినిమాలతో ప్రేక్షకుల ముందుకొచ్చాడు. వాటిలో 'జిల్', 'సిటీమార్' ఓ మోస్తరుగా ఒకే అనిపించుకున్నాయి. మిగిలిన సినిమాలేవీ కూడా ప్రేక్షకులని మెప్పించలేదు. ఒక సాలిడ్ సక్సెస్ కోసం గోపీచంద్ తో పాటు ఫ్యాన్స్ కూడా వెయిట్ చేస్తున్నారు. కానీ గోపి ఇమేజ్ కి తగ్గ సినిమా పడటం లేదని చాలా మంది అంటున్నారు. ఇదిలా ఉంటే తాజాగా గోపీచంద్ శ్రీను వైట్ల దర్శకత్వంలో 'విశ్వం' మూవీతో ప్రేక్షకుల ముందుకొచ్చారు. శ్రీనువైట్ల స్టైల్ కమర్షియల్ కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్టైనర్ గా విశ్వం మూవీ తెరకెక్కింది. 'ఆగడు' నుంచి వరుస డిజాస్టర్స్ అందుకున్న శ్రీనువైట్ల కొంత గ్యాప్ తీసుకొని 'విశ్వం' మూవీ తెరకెక్కించారు. సినిమాకి మొదటి రోజు పెద్దగా రెస్పాన్స్ ఏమి రాలేదు. అయితే హీరో, దర్శకుడు ఇద్దరు కూడా ఫ్లాప్ లతో ఉండటం వలన మూవీకి మొదటి రోజు చెప్పుకోదగ్గ స్థాయిలో కలెక్షన్స్ రాలేదు. వరల్డ్ వైడ్ గా కేవలం 28 వేల టికెట్స్ మాత్రమే బుక్ అయ్యాయంట. మొదటి రోజు టెక్నీకల్ సమస్యల కారణంగా కొన్ని చోట్ల షోలు ఆలస్యంగా పడ్డాయి. ఇది కూడా కలెక్షన్స్ పై ఇంపాక్ట్ చూపించినట్లు తెలుస్తోంది. అయితే రెండో రోజు 50 వేల వరకు టికెట్స్ తెగాయంట. దీంతో రెండో రోజు కలెక్షన్స్ కొంత పెరిగాయట. ఇక వీకెండ్ తర్వాత ఈ సినిమా కలెక్షన్స్ ఏ విదంగా ఉంటాయో చూడాలి. ఇదిలా ఉంటే రెండు రోజుల్లో విశ్వం మూవీ తెలుగు రాష్ట్రాలలో 4.10 కోట్ల గ్రాస్ కలెక్ట్ చేసింది. అందులో 2.40 షేర్ ఉంది.

EDITED,PRINTED,PUBLISHED AND OWNED BY BOLLEPAKA RAJESH,PRINTED AT AMULYA PUBLICATIONS & PRINTERS GRAPHICS,H-NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA,DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151."PUBLISHED AT H.NO: 2-19/1,VILLAGE & POST THATIKAYALA, DHARMASAGAR MANDAL,HANUMAKONDA DIST,TELANGANA STATE-506151.EDITOR : BOLLEPAKA RAJESH,RNI: TELTEL/2023/88710,"CELL:9493669669, MAIL ID:telanganamuchatlu.in@gmail.com,Website:telanganamuchatlu.in